## కువైట్ ఎయిర్‌పోర్టులో 13 గంటలపాటు చిక్కుకుపోయిన భారతీయ ప్రయాణికులు

భారతీయ ప్యాసింజర్లు 13 గంటలపాటు కువైట్ ఎయిర్‌పోర్టులో చిక్కి, చివరికి గల్ఫ్ ఎయిర్ విమానంలో మాంచెస్టర్‌కు బయలుదేరారు. ఈ సంఘటన సోమవారం ఉదయం జరిగింది. కువైట్ ఎయిర్‌పోర్టులో ఉన్న భారతీయ ప్యాసింజర్లు విమానం ఆలస్యంగా ప్రారంభమైన తర్వాత గల్ఫ్ ఎయిర్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే, ఆలస్యంతో ప్యాసింజర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానం ఆఖరికి బయలుదేరింది. కువైట్ నుండి మాంచెస్టర్ కు ప్యాసింజర్ల ప్రయాణంలో ఆలస్యం అయినప్పటికీ గల్ఫ్ ఎయిర్ సిబ్బంది సమర్థవంతంగా సమస్యను పరిష్కరించారు. ప్యాసింజర్లు ఎయిర్‌పోర్టులో కొన్ని గంటలు వేచి ఉండవలసి వచ్చినా, చివరకు వారికి విమానం అందించి, వారు సురక్షితంగా ప్రయాణించగలిగేలా చేసారు. ఈ ప్రయాణం అనేక చర్చలకు దారితీసింది, ముఖ్యంగా విమానాల ఆలస్యం మరియు ప్యాసింజర్లకు కలిగే అసౌకర్యం పై. ప్రయాణికులు తమ నిర్ణీత సమయానికి బయలుదేరలేకపోవడం, ఇతర సమస్యలు కూడా వారి ప్రయాణాన్ని మరింత కష్టం చేసినవి. ప్యాసింజర్లు తమ గమ్యస్థానానికి సాఫీగా చేరుకున్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :243 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: మంగళవారం 03-12-2024 పేజీలు:4 వెల: 2.00


# దేశంలో నల్లధనం పెరుగుతోంది..




హైదరాబాద్,బీజేపీ పాలనలో దేశంలో నల్లధనం భారీగా పెరిగిపోయిందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేస్తుంటే బీజేపీ మాత్రం అంబానీ, అదానీల మాఫీలు చేస్తుందని మండిపడ్డారు. ఇక్కడ ఉనికిని కాపాడుకునేందుకు తమపై చార్జ్ షీట్ విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికిని కాపాడుకోవడానికే తమ ప్రభుత్వంపై చార్జ్ షీట్ విడుదల చేసిందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ఇక్కడ అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. వడ్లకు కనీస మద్దతు ధర కల్పించాల్సిన కేంద్రం ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేని బీజేపీ రైతుల గురుంచి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడిన జీవన్ రెడ్డి.. దేశంలో ఎక్కడ లేనివిధంగా సన్న వడ్లకి తాము రూ. 500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు.

అంబానీ, అదానీలకు వేల కోట్లు మాఫీ..

రాష్ట్రంలో కోటి కుటుంబాలు ఉచిత కరెంట్ రాయితీ పొందుతున్నారు. 110 కోట్ల ఉచిత బస్ టికెట్లు ఇచ్చాం. ఏడాదికి 20వేల కోట్ల రూపాయలు వరకు సంక్షేమ కార్యక్రమాలకు ఇస్తున్నాం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాపి చేస్తున్నారా? యూపీ ప్రభుత్వం హయాంలో సోనియాగాంధీ జాతీయ స్థాయిలో రుణమాపి చేసింది. జాతీయ స్థాయిలో రుణమాఫీ చేసి ఉంటే రాష్ట్రానికి 20 వెల కోట్లు అదా అయ్యేవి. ఎన్నికల్లో ఇచ్చిన ఇతర హామీలని కూడా అమలు చేస్తాం. బీజేపీ నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు వేస్తాం అన్నారు. కానీ దేశంలో ఇంకా నల్లధనం పెరిగిపోయింది. మేము రైతుల రుణమాఫీ గురుంచి మాట్లాడుతుంటే.. బీజేపీ అంబానీ, అదానీ గురించి ఆలోచిస్తుందని, వాళ్ళకు మాత్రమే వేల కోట్లు మాఫీ చేస్తుందన్నారు. దేశానికి అన్నం పెట్టేది రైతు బీజేపీ పాలనలో నష్టాల్లో కూరుకుపోతున్నాడు. పెట్రోలియం, డీజిల్ 70 ఉంటే ఇప్పుడు 100 పైనే ఉంది. నిత్యావసర ధరలు ఆకాశాని అంటుతున్నాయి. 10 ఏళ్లు బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అన్నారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు. మేము అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు మీ రాష్ట్రాల్లో అమలు చేయాలంటూ జీవన్ రెడ్డి బీజేపికి సవాల్ చేశారు.

# మహారాష్ట్ర సీఎం ఎంపికపై కొనసాగుతున్న సస్పెన్స్..

ముంబై: మహారాష్ట్ర సీఎం ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ముఖ్యమంత్రి పదవికి బీజేపీ నేతనే ఎంపిక చేయనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మరోవైపు ముఖ్యమంత్రి రేసులో ఉన్న ఆపద్ధర్మ సీఎం, శివసేన నేత ఏక్నాథ్ షిండే మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ పెద్దల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి పదవిని బీజేపీ నేత అదిరోహించబోతున్నాడని, షిండేకు ఉపముఖ్యమంత్రి పదవి, కీలక శాఖలను అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, ముఖ్యమంత్రి పదవికి బీజేపీ నేతనే ఎంపిక చేస్తే.. వారిలో దేవేంద్ర ఫడ్నవీస్ ముందు వరుసలో ఉన్నారు. అతనికే అవకాశం దక్కుతుందా.. మరో బీజేపీ నేతను ఎంపిక చేస్తారా అనే విషయంపైనా ఉత్కంఠ నెలకొంది. ఇదిలాఉంటే.. బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఇవాళ ముంబయిలో జరుగుతుందని తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. ఈనెల 4వ తేదీకి సమావేశాన్ని వాయిదా వేశారు. 4వ తేదీన బీజేపీ శాసనసభా పక్ష సమావేశం జరగనున్న నేపథ్యంలో రేపు మధ్యాహ్నానికి ముంబై రావాలని తమ ఎమ్మెల్యేలందరికీ బీజేపీ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అనంతరం మహాయుతి నేతలు గవర్నర్ ను కలవనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరనున్నారు. అయితే, డిసెంబర్ 5న ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని కూటమి నేతలు పేర్కొంటున్నప్పటికీ.. 5న ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తారా మరో తేదీన నిర్ణయిస్తారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

షిండే కుమారుడు కీలక వ్యాఖ్యలు..

మహారాష్ట్రలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వంలో తాను డిప్యూటీ ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరిస్తానని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే స్పష్టం చేశారు. మహాయుతి



ప్రభుత్వం కొలువుదీరడానికి ముందు రకరకాల వదంతులు వ్యాపిస్తున్నాయంటూ శ్రీకాంత్ షిండే 'ఎక్స్'లో పోస్టు చేశాడు. శ్రీకాంత్ షిండే ట్వీట్ లో ఏం చెప్పారంటే.. "మహాకూటమి ప్రభుత్వ ప్రమాణస్వీకారోత్సవం కాస్త ఆలస్యమైందని, ప్రస్తుతం దీనిపై సర్వత్రా చర్చలు, పుకార్లు జరుగుతున్నాయి. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అనారోగ్య కారణాలతో రెండు రోజులు స్వగ్రామానికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రిని నేనే అనే వార్తలు గత రెండు రోజులుగా క్వశ్చన్ మార్కులతో మీడియాలో వస్తున్నాయి. నిజానికి అందులో ఎలాంటి నిజం లేదు. ఉపముఖ్యమంత్రిగా నా పదవిపై వస్తున్న వార్తలన్నీ నిరాధారమైనవి. లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా నాకు కేంద్ర ప్రభుత్వంలో మంత్రి అయ్యే అవకాశం వచ్చింది. కానీ, పార్టీ బలోపేతంకోసం పని చేయాలని భావించి, అప్పుడు కూడా మంత్రి పదవిని నిరాకరించాను. అధికారంలో ఉండాలనే కోరిక నాకు లేదు. రాష్ట్రంలో మంత్రి పదవి రేసులో నేను లేనని మరోసారి స్పష్టం చేస్తున్నాను. నా లోక్‌సభ నియోజకవర్గానికి, శివసేనకు మాత్రమే నేను పనిచేస్తాను." అంటూ శ్రీకాంత్ షిండే పేర్కొన్నారు.

# డబుల్ టంగ్ లీడర్లతో చాలా డేంజర్..

హైదరాబాద్ : డబుల్ ఎడ్జ్ నైఫ్‌తోనైనా జాగ్రత్తగా ఉండొచ్చు.. కానీ డబుల్ టంగ్ లీడర్లతో చాలా డేంజర్ అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి ద్వంద్వ వైఖరిపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ నెల ఏడో తారీఖున కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జీషీటు వేస్తాం. ఈ ఏడాది కాలంలో రెండు నాల్కల ధోరణి ప్రదర్శించారు సీఎం రేవంత్ రెడ్డి.. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మాట మార్చిన తీరు రేవంత్‌లో కనిపిస్తుంది. సీఎం అయ్యాక కూడా ఆయన మాట మార్చిన తీరును అందరూ గమనిస్తూనే ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు.

రెండు తలల పాము కంటే రేవంత్ డేంజర్

ప్రజలను ఏ రకంగా మోసం చేస్తున్నారు.. వంచిస్తున్నారు.. ఆయన నైజం ఏంటో ప్రజల ముందు నిజస్వరూపాన్ని బయటపెట్టే ప్రయత్నం చేస్తున్నాం. రెండు తలల పామును చూసి భయపడుతాం. కానీ పాపం అది ఏం అనదు.. పెద్ద ప్రమాదకరం కాదు. రెండు నాల్కల ధోరణి కలిగిన మనషులు ఉంటారు. కానీ అలాంటి వారిని పెద్దగా పట్టించుకోం. కానీ అది చాలా ప్రమాదకరం. ఈ రెండు నాల్కల వైఖరి నిదర్శనం ఎవరంటే నిస్సందేహంగా రేవంత్ రెడ్డి అని చెప్తారు. డబుల్ ఎడ్జ్ నైఫ్‌తోనైనా జాగ్రత్తగా ఉండొచ్చు.. కానీ డబుల్ టంగ్ లీడర్లతో చాలా డేంజర్. సమాజానికి చాలా నష్టం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

డబుల్ స్టాండర్డ్స్‌లో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ



డబుల్ స్టాండర్డ్స్ అంటే ఒక విషయంపై నిన్న, నేడు, రేపు ఒక మాట మాట్లాడడం. ఇందులో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ చేశారు. మాట మార్చడంలో, పూటకో మాట మాట్లాడడంలో రేవంత్ రెడ్డి దిట్ట. నేను ఆ మాట అనలేదు.. ఎవరు అన్నారంటూ ఉల్టా దబాయించి ముచ్చటగా మూడో మాట చెప్పగలిగిన నేర్పరితనం కూడా రేవంత్ రెడ్డిలో ఉంది. ఇవన్నీ రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీ అగ్ర నాయకులను రాక్షసులు అంటడు. మళ్లీ అదే పార్టీలో చేరి దేవతలు అంటడు. రాక్షసులు అన్న నోటితోనే దేవతలను పొగుడుతాడు. సిగ్గు, ఎగ్గు, సంకోచం, వ్యాకోచం ఏం లేకుండా నిస్సిగ్గుగా మాట్లాడే తత్వం రేవంత్ రెడ్డిది అని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

# వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య..




ములుగు, నవంబర్ 2 : ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య చేసుకున్నారు. ముళ్లకట్ట సమీపంలోని హరిత రిసార్ట్స్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తున్నది. అయితే ఏటూరునాగారంలో ఎన్‌కౌంటర్ జరిగిన రాత్రే ఆయన సూసైడ్ చేసుకోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నత అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరు కొనసాగింది. ఇరువర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు సమీప గ్రామాల ప్రజలు చెప్తున్నారు. చెల్పాక పంచాయతీ పరిధిలోని పోలుకమ్మ వాగు గొత్తికోయగూడేనికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం పుల్లలమెద తోగు సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శబరీశ్ పరిశీలించారు. మృతుల్లో నర్సంపేట-ఇల్లందు ఏరియా దళ కమాండర్ కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), డివిజన్ కమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ కోటి (43), ఏరియా కమిటీ సభ్యురాలు ముసకి జమున (23), ఏరియా కమిటీ సభ్యుడు కరుణాకర్ (22) ఉన్నట్టు ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉన్నదని చెప్పారు. పీఎల్‌జీఏ వారోత్సవాలకు ఒకరోజు ముందు మావోయిస్టు పార్టీకి తెలంగాణలో భారీ దెబ్బ కోలుకోలేని దెబ్బతగిలింది.

## ఆప్‌లో చేరిన ప్రముఖ ఎడ్యుకేటర్ అవధ్ ఓఝా

న్యూఢిల్లీ, ప్రముఖ ఎడ్యుకేటర్ అవధ్ ఓఝా ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్, సీనియర్ నాయకుడు మనీష్ సిసోడియా సమక్షంలో ఓఝా ఆప్ తీర్థం పుచ్చుకున్నారు. అర్వింద్ కేజ్రీవాల్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఓఝా మీడియాతో మాట్లాడుతూ.. విద్య అనేది కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఆత్మ లాంటి మాధ్యమమని అన్నారు. రాజకీయాల్లో చేరి విద్యాభివృద్ధికి కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించిన అర్వింద్ కేజ్రీవాల్‌కు, మనీష్ సిసోడియాకు అవధ్ ఓఝా కృతజ్ఞతలు తెలిపారు. 'ఇవాళ నేను రాజకీయాల్లో అడుగుపెడుతున్న సందర్భంగా మీతో ఒక విషయం స్పష్టం చేయదల్చుకున్నాను. నేను రాజకీయాలు, ఎడ్యుకేషన్‌లో ఏదో ఒకటి మాత్రమే ఎంచుకోవాల్సి వస్తే కచ్చితంగా ఎడ్యుకేషన్‌నే ఎంచుకుంటాను' అని ఓఝా చెప్పారు. రాజకీయాల్లో చేరడం ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేయాలని తాను ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నానని ఓఝా తెలిపారు. ఓఝా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసే అభ్యర్థులకు శిక్షణ ఇస్తుంటారు. ఆయన దగ్గర శిక్షణ తీసుకున్న ఎంతో మంది ఉద్యోగార్థులు పెద్దపెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు.

# మెహబూబా ముఫ్తీ వివాదాస్పద వ్యాఖ్యలు..



జమ్మూ : జమ్మూ కాశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి. బంగ్లాదేశ్‌లో మైనారిటీల పరిస్థితి, భారత్‌లోని మైనారిటీల పరిస్థితి ఒకేలా ఉందని, రెండు దేశాల మధ్య భేదం లేదని ఆమె అన్నారు. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ) చీఫ్ ముఫ్తీ ప్రకటనను పలువురు బీజేపీ నేతలు ఖండించారు. ఆమె వ్యాఖ్యలు జాతి వ్యతిరేకమని చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వాన్ని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని, భారత్ లోనూ మైనారిటీలపై అఘాయిత్యాలు జరుగుతుంటే, భారత్ బంగ్లాదేశ్‌కి తేడా ఏంటి..? ఈ రెండు దేశాల మధ్య నాకు ఎలాంటి తేడా కనిపించడం లేదని పార్టీ కార్యకర్తల మీటింగ్‌లో ముఫ్తీ అన్నారు. మనకు ఇంత గొప్ప దేశం ఉందని, సెక్యులర్ స్వభావంలో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని ఆమె అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మతగురువు చిన్మోయ్ కృష్ణదాస్ అరెస్టుపై నిరసనలు జరుగుతున్న వేళ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఆమె వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ పరిస్థితిని భారత్‌తో పోల్చడం పూర్తిగా ఖండించదగినదని, బంగ్లాదేశ్‌లో అత్యంత దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘన గురించి ప్రపంచానికి తెలుసు, ఇక్కడ మైనారిటీ సమాజం లక్ష్యంగా దాడులు, మహిళల అవమానాల గురించి ప్రపంచానికి తెలుసని జమ్మూ కాశ్మీర్ మాజీ బీజేపీ చీఫ్ రవిందర్ రైనా అన్నారు. ఎన్నికైన ప్రధాని దేశం విడిచి పారిపోయేటట్లు చేయడం, ఆ దేశ జాతిపతను అగౌరపరడంపై ఆయన మాట్లాడారు. జమ్మూ-కశ్మీర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఓపి) సునీల్ శర్మ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం తర్వాత మెహబూబా ముఫ్తీ తన పార్టీని పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్నమని అన్నారు. పీడీపీ పూర్తిగా మునిగిపోయింది, మెహబూబా తన పార్టీని మళ్లీ స్థాపించేందుకు ముస్లింలను రెచ్చగొట్టడానికి ఇలాంటి ప్రకటన చేస్తోందని ఆయన ఆరోపించారు. సంభాల్ మసీదు సర్వే సమయంలో జరిగిన హింస గురించి ముఫ్తీ మాట్లాడుతూ.. కొందరు షాపుల్లో పనిచేసే వారిని చంపేశారని అన్నారు. 1947 నాటి పరిస్థితులు వస్తున్నాయని ఆమె కామెంట్స్ చేశారు.

# బీజేపీలో ముసలం.. పార్టీ ఎమ్మెల్యేకు హైకమాండ్ షోకాజ్‌నోటీసులు

బెంగళూరు: కర్ణాటక బీజేపీలో కోల్డ్ వార్ నడుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ రెండు వర్గాలుగా చీలిపోయిందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఒకటి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర కాగా.. మరొకటి సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ గ్రూప్‌గా తయారైంది. పార్టీలో అంతర్గత విబేధాల నేపథ్యంలో నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. తాజాగా బసనగౌడ, విజయేంద్ర వివాదంపై బీజేపీ హైకమాండ్ జోక్యం చేసుకుంది. ఈ మేరకు బసనగౌడ యత్నాల్‌కు షోకాజ్ నోటీసులు అందించింది. పార్టీ సిద్ధాంత వ్యతిరేక వ్యాఖ్యలపై పది రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని లేకుంటే అధిష్టానం చర్యలు తీసుకుంటుందని తెలిపింది. 'రాష్ట్ర స్థాయి పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా యత్నాల్ ప్రవర్తిస్తున్నారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించడం, బహిరంగ ప్రకటనలు చేయడం ఆందోళన కలిగించే విషయం. యత్నాల్ వైఖరి రాజకీయ, ప్రజా ప్రాముఖ్యత ఉన్న అన్ని విషయాలపై పార్టీ అధికారిక వైఖరికి విరుద్ధంగా ఉంది. పార్టీ నాయకులపై మీరు చేసిన తప్పుడు, ఆరోపణలు పార్టీ క్రమశిక్షణను తీవ్రంగా ఉల్లంఘించడమే. మీ చర్యలపై పది రోజుల్లోగా సమాధానం ఇవ్వాలి. లేనిపక్షంలో పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంటుంది' అని షోకాజ్ నోటీసులో పేర్కొంది. కాగా విజయేంద్రపై బసనగైడ తరుచూ విమర్శలు చేస్తున్నారు. విజయేంద్ర ఆయన వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, పార్టీ నేతలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన కర్ణాటక ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమికి ఆయనే కారణమయ్యారని ఆరోపించారు. ఈ క్రమంలోనే హైకమాండ్ చర్యలు చేపట్టింది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ



ఓడిపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇక, తాజాగా ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమికి బీఎస్ యడియూరప్ప, విజయేంద్రనే కారణమని పాటిల్ తీవ్ర విమర్శలు చేశారు. వీరిద్దరూ పార్టీ నేతలను పట్టించుకోవడం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. క్రమశిక్షణా నోటీసులపై స్పందించిన యత్నాల్.. పార్టీ నోటీసులకు సమాధానం చెబుతానని పేర్కొన్నారు. కర్ణాటకలో పార్టీ ప్రస్తుత స్థితిని కూడా తెలియజేస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా శనివారం ఢిల్లీలో పార్టీ జాతీయ నాయకత్వంతో విజయేంద్ర భేటీ అయిన నేపథ్యంలో ఈ నోటీసులు వెలువడ్డాయి. రాజకీయ లబ్ధి కోసం యత్నాల్ తనపై, తన తండ్రి బీఎస్ యడియూరప్పపై నిత్యం తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని విజయేంద్ర నాయకత్వానికి ఫిర్యాదు చేశారు.

# సుప్రీంకోర్టులో అగ్ని ప్రమాదం...

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రాంగణంలో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. కోర్టు నెంబర్ 11, 12ల మధ్య ఉన్న వెయిటింగ్ ఏరియాలో నేటి మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన సుప్రీంకోర్టు సెక్యూరిటీ, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుదాఘాతం కారణంగా ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని సుప్రీంకోర్టు సిబ్బంది ప్రకటించారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని వెల్లడించారు. ఈ అగ్ని ప్రమాదంతో కోర్టు కార్యకలాపాలకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.



## సంపాదకీయం

మంగళవారం 03-12-2024

# మానని గాయం...

ఆధునిక కాలంలో మనిషి అంతరిక్షాన్ని అందుకోగలిగాడుబీ చంద్రమండలం మీద అడుగు మోప గలిగాడుబీ సహజ మేధకు పోటీగా కృత్రిమ మేధను సృష్టించాడుబీ విశ్వామిత్ర సృష్టిని తలపించేలా మనుషులకు దీటైన మరమనుషులను సృష్టించాడు. ఇంతటి మహత్తర ఘనతలను చూసినప్పుడల్లా 'మానవుడే మహనీయుడు/ శక్తియుతుడు యుక్తిపరుడు మానవుడే మహనీయుడు... జీవకోటి సర్వములో శ్రేష్ఠతముడు మానవుడే!' అనుకుంటూ గర్వంతో ఉప్పొంగిపోతాం. రేపో మాపో అంగారక గ్రహం మీద ఆవాసాలను ఏర్పాటు చేసే దిశగా మనుషులు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుసుకున్నప్పుడు ఉత్సాహంతో ఉబ్బి తబ్బిబ్బయిపోతాం. మనిషి సాధించిన ఘన విజయాలను ఏకరువు పెట్టాలంటే, ఎన్ని గ్రంథాలైనా చాలవు. చరిత్రలో ఇన్ని ఘన విజయాలు సాధించిన మనిషికి అనాది పరాజయాలు కూడా ఉన్నాయి. ఆధునికత సంతరించుకుని, అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్న మనిషి%–%అమరత్వాన్ని సాధించే దిశగా కూడా ప్రయత్నాలు సాగిస్తున్నాడు. అయితే, ఆకలి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని నేటికీ కనుక్కోలేకపోవడం మాత్రం ముమ్మాటికీ మనిషి వైఫల్యమే! యుద్ధాలలో ఉపయోగించ డానికి అధునాతన ఆయుధాలను ఎప్పటికప్పుడు తయారు చేయగలుగుతున్న మనిషి %–% అసలు యుద్ధాల అవసరమే లేని శాంతియుత ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం కూడా వైఫల్యమే! ప్రపంచంలో మనిషికి క్షుద్బాధను మించిన దుర్భర బాధ మరొకటేదీ లేదు. పురాణ సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు ఆకలి ప్రస్తావన మనకు విరివిగా కనిపిస్తుంది. తాను ఆకలితో అలమటిస్తున్నా, అతిథికి అన్నం పెట్టి పుణ్యలోకాలకు వెళ్లిన రంతిదేవుడి కథ తెలిసినదే! ఆకలికి తాళలేక కుక్కమాంసం తిన్న విశ్వామిత్రుడి కథ పురాణ విదితమే! ఆకలి బాధ మనిషిని ఎంతకైనా దిగజారుస్తుంది. అందుకు విశ్వామిత్రుడి కథే ఉదాహరణ. పురాణాల్లో అక్షయపాత్రలు పుణ్యాత్ముల ఆకలి తీర్చిన గాథలు ఉన్నాయే గాని, సామాన్యుల ఆకలి తీర్చిన ఉదంతాలు లేవు. ఆకలితో అలమ టిస్తున్నా, త్యాగం చేయడం గొప్ప సుగుణమని చెప్పే పురాణాలు – ఆకలికి శాశ్వత పరిష్కారాన్ని మాత్రం చెప్పలేదు. ఆధునిక సాహిత్యంలో ఆకలి ప్రస్తావనకు కరవు లేదు. స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో 'మాకొద్దీ తెల్లదొరతనము' అని ఎలుగెత్తిన గరిమెళ్ల – ఆ పాటలోనే 'పన్నెండు దేశాలు పండుతున్నాగాని/ పట్టెడన్నమె లోపమండీ/ ఉప్పు పట్టుకుంటే దోషమండీ/ నోట మట్టి కొట్టుకుపోతామండీ/ అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండీ' అంటారు. స్వాతంత్ర్యం రాక ముందు మన దేశంలోని ఆకలి బాధలు అలా ఉండేవి. ప్రపంచమంతలా ఆర్థికమాంద్యంతో అతలా కుతలమైన హంగ్రీ థర్టీస్ కాలంలో కలంతో కవాతు చేసిన కవులందరూ ఆకలి కేకలు వినిపించిన వారే! 'ఆకలి ఆకలి తెరిచిన/ రౌరవ నరకపు వాకిలి/ హృదయపు మెత్తని చోటుల గీరే జంతువు ఆకలి/... ఈ ఆకలి హోరు ముందు/ పిడుగైనా వినిపించదు/ ఆకలి కమ్మిన కళ్లకు/ ప్రపంచమే కనిపించదు' అన్న బైరాగి 'ఆకలి' కవిత పాఠకులను విచలితులను చేస్తుంది. 'అన్నపూర్ణ గర్భగుడిని/ ఆకలి గంటలు మ్రోగెను/ ఆరని ఆకలి కీలలు/ భైరవ నాట్యము చేసెను/ ఘోర పరాజ యమా ఇది?/ మానవ మారణ హోమం/ తల్లీ! ఆకలి... ఆకలి!' అంటూ సోమసుందర్ ఆకలి కేకలు వినిపించారు. 'నేను ఆకలితో ఉన్నాను/ నువ్వు చంద్రుడి వద్దకు వెళ్లావు... నేను తిండిలేక నీరసిస్తున్నాను/ నాకు వాగ్దానాలు మేపుతున్నావు' అంటూ ఆధునిక శాస్త్ర సాంకేతిక పురోగతి ఒకవైపు, ఆకలి బాధలు మరోవైపుగా ఉన్న ఈ లోకంలో పాలకుల తీరును శ్రీశ్రీ ఎత్తిపొడుస్తారు. ఇప్పటికీ లోకం తీరు పెద్దగా మారలేదు. మానవుడు పంపిన ఉపగ్రహాలు అంగారకుడి వద్దకు వెళ్లినా, ఆకలి బాధలు సమసి పోలేదుబీ ఆకలి చావులు ఆగిపోలేదు.మనిషి ఘన విజయాల చరిత్రలో ఆకలి, అశాంతి రెండూ మాయని మరకలు. ఈ రెండు మరకలూ పూర్తిగా చెరిగిపోయేంత వరకు మనిషి ఎన్ని విజయాలు సాధించినా, అవేవీ మానవాళికి ఊరటనూ ఇవ్వలేవుబీ మానవాళిని ఏమాత్రం ఉద్ధరించనూ లేవు. ఆకలికి, అశాంతికి మూలం మను షుల్లోని అసమానతలే! ప్రపంచంలో అసమానతలు తొలగిపోనంత వరకు ఆకలిని రూపుమాపడం, శాంతిని నెలకొల్పడం అసాధ్యం. నిజానికి సంకల్పం ఉంటే, సాధ్యం కానిదంటూ ఏదీ లేదు గాని, అసమానతలను రూపుమాపే సంకల్పమే ఏ దేశంలోనూ పాలకులకు లేదు. అందువల్లనే ఆకలి, అశాంతి మనుషులను తరతరాలుగా పట్టి పీడిస్తున్నాయి. అకాల మరణాలకు కారణమవుతున్నాయి. ఆకలి వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు పాతికవేల మంది ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి. అంటే, ఏడాదికి సగటున ఏకంగా తొంభై లక్షల మంది ఆకలికి బలైపోతున్నారు. ఆకలితో మరణిస్తున్న వాళ్లలో పసిపిల్లలు కూడా ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న శిశుమరణాల్లో దాదాపు యాభై శాతం ఆకలి చావులే! నాణేనికి ఇదొకవైపు అయితే, మరోవైపు వంద కోట్లమందికి ఆకలి తీర్చడానికి తగినంత ఆహారం ప్రతిరోజూ వృథా అవుతోంది. ఈ పరిస్థితిని గమనించే 'అన్నపు రాసులు ఒకచోట/ ఆకలి మంటలు ఒకచోట' అని కాళోజీ వాపోయారు.ప్రపంచ ఆర్థిక శక్తుల్లో ఐదో స్థానంలో ఉన్న మన దేశం%–% ఆకలి సూచీలో నూట ఐదో స్థానంలో ఉండటం ఒక కఠోర వాస్తవం. అమృతోత్సవ భారతంలో ఆకలి సమస్య ఒక మానని గాయం!

# చట్టంతోనే సోషల్ మీడియా కట్టడి..

న్యూఢిల్లీ,తర దేశాలతో పోల్చితే మనదేశంలో సోషల్ మీడియా చట్టాలు బలహీనంగా ఉన్నాయి. సామాజిక మాధ్యమాల పట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడం దీనికి ప్రధాన కారణం. ప్రత్యర్థులను దొంగ దెబ్బతీయడానికి స్వార్థపర రాజకీయ నాయకులకు సోషల్ మీడియా ఒక ఆయుధంగా మారింది. విజ్ఞానాన్ని పంచుకోవడానికి, సమాచార చేరవేతకు, ప్రభుత్వమూ ప్రజల మధ్య సంధానానికీ ఎంతో ఉపయోగపడగలిగే సోషల్ మీడియాను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఫోటోలను, మాటలను మార్ఫ్ చేస్తూ లేనివి ఉన్నట్లుగా, ఉన్నవి లేనట్లుగా కల్పించడం చేస్తున్నారు. ఫోటోల మార్ఫింగ్, ఫోన్ ట్రాపింగ్‌ల కారణంగా వందల సంఖ్యలో కుటుంబాలు విచ్ఛిన్నం కావడమే గాక అనేకమంది మధ్యంతరంగా జీవితాలను ముగిస్తున్నారు. ఎలక్ట్రానిక్/ కంప్యూటర్ రంగంలో రోజురోజుకీ చోటు చేసుకొంటున్న మార్పులను ప్రజల కంటే ముందు మోసగాళ్ళూ, సంఘ విద్రోహులూ అందిపుచ్చుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల అమాయకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాను అసాంఘిక కార్యకలాపాల కోసం వాడుతున్న సంస్థలను, వ్యక్తులను నియంత్రిం చేందుకు ప్రభుత్వ కఠిన వ్యవహార శైలి మాత్రమే సరిపోదు. పటిష్టమైన చట్టాలను కూడా రూపొందించాలి. అమెరికాలో ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టిసి) పేరిట సోషల్ మీడియాలో వచ్చే మోసపూరిత వ్యాపార ప్రకటనలు, పిల్లలను ఏమార్చే ప్రకటలను నివారించడానికి నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ ఉన్నాయి. సెక్షన్ 230 ప్రకారం సోషల్ మీడియాలో తప్పుడు, మోసపూరిత సమాచారాన్ని చేరవేసేవారిపై కఠిన చర్యలు తీసుకొనే అవకాశం అక్కడ ఉంది. ఇదే చట్టాన్ని సవరించడం ద్వారా ద్వేషపూరిత ప్రసంగాలను, మాటలను ప్రచారం చేయకుండా నిషేధించారు. యూరోప్ దేశాలలో అయితే సమాచారాన్ని దొంగిలించినా, దుర్వినియోగం చేసినా భారీ మొత్తంలో జరిమానాలు విధించే విధంగా చట్టం రూపొందించారు. అసాంఘిక అంశాలు, ఉద్రిక్తతలు రెచ్చకొట్టే ప్రసంగాలు, చట్టసమ్మతంకాని సమాచారాలను ప్రచారం చేయకుండా ఉండటం కోసం ప్రత్యేకంగా 'డిజిటల్ సర్వీస్ ఆక్ట్'ను రూపొందించారు. అదే విధంగా అభ్యంతరకరమైన మాటలు, అబద్ధపు మాటలు, ప్రసంగాలు 24 గంటల్లోనే సోషల్ మీడియా నుంచి తొలగించడానికి వీలుగా 'ఈయు హేట్ స్పీచ్ కోడ్'ను రూపొందించారు. జర్మనీలో అభ్యంతరకరమైన, అబద్ధపు మాటలు, ప్రసంగాలు 24 గంటల్లోనే సోషల్ మీడియా నుంచి తొలగించని పక్షంలో పెద్ద మొత్తంలో జరిమానా విధించే విధంగా 'నెట్‌వర్క్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆక్ట్'ను రూపొందించారు. ఆస్ట్రేలియాలో సోషల్ మీడియాను నియంత్రించడానికి 'ఆన్‌లైన్ సేఫ్టీ ఆక్ట్' అమల్లోకి తెచ్చారు. అదేవిధంగా చైనా, సింగపూర్‌లలో కూడా సోషల్ మీడియా నియంత్రణకు పటిష్టమైన చట్టాలు అమలవుతున్నాయి. ఆయా దేశాలలో ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి సంస్థలన్నీ పైన తెలిపిన చట్టాలకు లోబడే



సేవలందిస్తున్నాయి. న దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు చాలా బలహీనంగా ఉన్నాయి. భారతదేశంలో సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి 2021లో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియటరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ ఒక చట్టం రూపొందించారు. ఈ చట్టం ప్రకారం ఆన్‌లైన్‌లో అసాంఘిక అంశాలు, ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రసంగాలు, చట్టసమ్మతం కాని సమాచారాలను నియంత్రించాల్సి ఉంది. అయితే ఇందుకు అవసరమైన నిపుణులను, ఇతర సిబ్బందిని ప్రభుత్వాలు తగినంతగా నియమించలేదు. ఈ కారణంగా సోషల్ మీడియా దారుణంగా దుర్వినియోగం అవుతోంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఓట్ల సంపాదన, అధికారమే పరమావధిగా చేయకూడని ప్రచారమంతా చేస్తున్నారు. సోషల్ మీడియా ఉచితంగా లభించే వేదిక కావడం వల్ల మరింతగా రెచ్చిపోతున్నారు. ఎవరికి వారు ప్రచారం చేసుకొనే సమయంలో తమ గురించి తాము ఎంత గొప్పగా ప్రచారం చేసుకున్నప్పటికీ ఇబ్బంది లేదు, కానీ ఎదుటి వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా కామెంట్ చేయడం జీవితాలను అతలాకుతలం చేస్తోంది. ఎన్నికలలో విజయం సాధించడానికి కొన్ని సంస్థలు రాజకీయ పార్టీలకు ఇచ్చే సూచనలు నీచంగా ఉంటున్నాయి. సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చట్టాలు చేసుకోవడమే కాకుండా దేశం మొత్తంగా అమలయ్యే విధంగా ఒక నియంత్రణ చట్టాన్ని రూపొందించాలి. ఈ మేరకు మేధావులు, సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలి. ఇదే సమయంలో సోషల్ మీడియా నియంత్రణకు చాలీచాలని స్థానిక పోలీసులతో కాకుండా నైపుణ్యం కలిగినవారితో ప్రత్యేకంగా పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చట్టాలు చేసుకోవడమే కాకుండా దేశం మొత్తంగా అమలయ్యే విధంగా ఒక నియంత్రణ చట్టాన్ని రూపొందించాలి.

# ఓటింగ్ యంత్రాలు.. చీటింగ్ తంత్రాలు?




న్యూఢిల్లీ,ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను ప్రవేశపెట్టిన కొంత కాలానికే ఆ పద్ధతి మీద పలు రాజకీయ పక్షాలు సందేహాలు వ్యక్తం చేయడంమొదలైంది. ఇవాళ ఎలక్ట్రానిక్ ఓటింగ్ ను గట్టిగా సమర్థిస్తున్న కొన్ని రాజకీయ పక్షాలు ఒకప్పుడు ఇంటి పైకప్పు ఎక్కి 'ఈ పద్ధతి తప్పుల తడకగా ఉంది మాకు మళ్ళీ పేపర్ బ్యాలెట్ కావాలి' అని అరిచి గీపెట్టిన సందర్భాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రధాన రాజకీయ పక్షాలు గత 10 ఏళ్ల కాలంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ పట్ల అనేక అనుమానాలువెలిబుచ్చుతున్న విషయం తెలిసిందే.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఏర్పడిన తొలి ప్రభుత్వం ఆ తర్వాత గడువు కంటే ముందు 2018 లోనే ఎన్నికలకు వెళ్ళింది. ఆనాటి ఫలితాలు అనుమానాల్ని రేకెత్తించాయి. పోలైన ఓట్ల కంటే చాలా ఎక్కువ సంఖ్యలో ఓట్ల లెక్కింపు జరగడం అనుమానాలకు తావిచ్చింది. అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ భారీ మెజారిటీతో ఎక్కువ స్థానాలను గెలుచుకోవడం వాస్తవపరిస్థితికి భిన్నంగా ఉందనే విమర్శలు కూడా వచ్చాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను అధికారంలో ఉన్నవాళ్లు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని అనుమానాలు బలపడటం మొదలైంది. ఆ తర్వాత కొద్ది మాసాలకే 2019లో జరిగిన లోకసభ ఎన్నికలలో ఫలితాలు మరిన్ని అనుమానాలకు దారితీసాయి.అది 1983 సార్వత్రిక ఎన్నికల సమయం.. భారతదేశంలో అప్పుడప్పుడే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెడుతున్నారు. ఆ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని అప్పటి మహబూబ్ నగర్ జి ల్లాలో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ద్వారా పోలింగ్ జరిగింది. ఆ కారణంగానే ఆ ఎన్నికల ఫలితాల రోజున లెక్కింపు మొదలైన మొ దటి గంటలోనే షాద్ నగర్ ఫలితం వెలువడి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ శంకర్రావు గెలుపొందారు. బోణీ కాంగ్రెస్ చేయడంతో ఇంకేముంది అప్పుడే పుట్టిన తెలుగుదేశం పార్టీకి పుట్టగతులు ఉండవని ఎన్‌టీ రామారావు అల్లుడు నారా చం ద్రబాబు నాయుడుతో సహా కాంగ్రెస్ వారంతా భావించారు. ఆ భావనను తలకిందులు చేస్తూ తర్వాత దాదాపు 100 ని యోజకవర్గాలవరకు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు. ఆ ఎన్నికల్లో ఎన్టీ రామారావు అప్పుడే స్థాపించిన తెలుగుదేశం పార్టీ అత్యద్భుత విజయాన్ని సాధించిన విషయం అందరికీ తెలిసిందే. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లవల్ల ఓట్ల లెక్కింపు సుల భం అవుతుంది, ఫలితం త్వరగా వెలువడుతుందన్న విషయం ఆరోజు అందరికీ అర్థం అయిపోయింది. తర్వాతి కాలంలో దేశంలో దశలవారీగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ ను ప్రవేశపెట్టి చివరికి పేపర్ బ్యాలెట్ లేకుండానే మనం ఎలక్ట్రానిక్ ఓటింగ్ కు పోతున్న సంగతి కూడా అందరికీ తెలుసు.అమెరికా అభివృద్ధి చెందిన దేశాలతో సహా పలు ఇప్పటికీ పేపర్ బ్యాలెట్‌నే వాడుతున్నారు. భారతదేశంలో మాత్రం టెక్నాలజీని అందిపుచ్చుకొని సులువైన మార్గంలో ఎన్నికలు నిర్వహించగలుగుతున్నామని చెప్పి గర్వపడు తూ ఉండేవాళ్ళం నిన్నటిదాకా. అందుకు కారణాలు అనేకం. పేపర్ బ్యాలెట్ వల్ల ఓట్ల లెక్కింపునకు చాలా సమ యం పడుతుందనే విషయంతోపాటు దుండగులు దాడిచేసి వాటిని చిం చేసే, కాల్చేసే అవకాశం కూడా ఉండేది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతి రాక మునుపు ఓట్ల లెక్కింపు ఒక పెద్ద కార్యక్రమంగా ఉండేది. పూర్తి ఫలితాలు వెలువడడానికి కనీసం రెండున్నర రోజులు పట్టేది. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని ఒక విభాగంలో విలేకరులు కూర్చుని ఎన్నికల ఫలితాలను తెలుసుకోవడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసేది. వంతులవారీగా డ్యూటీలు వేసుకుని విలేకరులు రెండు రోజులపాటు సచివాలయంలో ఉండి పోవాల్సిన పరిస్థితి.అయితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను ప్రవేశపెట్టిన కొంత కాలానికే ఆ పద్ధతి మీద పలు రాజకీయ పక్షాలు సందేహాలు వ్యక్తం చేయడం మొదలైంది. ఇవాళ ఎలక్ట్రానిక్ ఓటింగ్ ను గట్టిగా సమర్థిస్తున్న కొన్ని రాజకీయ పక్షాలు ఒకప్పుడు ఇంటి పైకప్పు ఎక్కి 'ఈ పద్ధతి తప్పుల తడకగా ఉంది మాకు మళ్ళీ పేపర్ బ్యాలెట్ కావాలి' అని అరిచి గీపెట్టిన సం దర్భాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రధాన రాజకీ య పక్షాలు గత 10 ఏళ్ల కాలంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ పట్ల అనేక అనుమానాలు వెలిబుచ్చుతున్న విషయం తెలిసిందే.ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మొరాయించడం, పనిచేయకపోవడం వంటివి చిన్నచిన్న సమస్యలు. వాటిపట్ల ఓటర్లలో నమ్మ కం కలిగించడానికి, రాజకీయ పక్షాలు కూడా వాటిని నమ్మడానికి ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ఒక పద్ధతి వివి ప్యాట్లు. మన ఓటు ఎవరికి వేసామన్నది ఆ వివి ప్యాట్లల్లో ముద్రితమై ఉంటుంది. యంత్రం తప్పు చేసిందని ఎవరైనా అనుమానపడితే వివి ప్యాట్లను లెక్కించి వారి అనుమానాలను నివృత్తి చేయాలి. ఇదంతా ఒక ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్య పద్ధతి. ఇటువంటి ప్రజాస్వామ్య సాంప్రదాయాలని కాపాడవలసిన బాధ్యత స్వయం ప్రతిపత్తి కలిగి ఉండే కేంద్ర ఎన్నికల సంఘానిది, దానికి బాధ్యులైన అధికారులు అందరిదీ కూడా.అయితే గత కొంతకాలంగా ఇందుకు భిన్నమైన పరిస్థితి దేశంలో నెలకొని ఉండడమే కొన్ని రాజకీయ పక్షాలు ఆందోళన వెలిబుచ్చడానికి కారణం అయింది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఏర్పడిన తొలి ప్రభుత్వం గడువు కంటే ముందు 2018 లోనే ఎన్నికలకు వెళ్ళింది. ఆనాటి ఫలితాలు అనుమానాల్ని రేకెత్తించాయి. పోలైన ఓట్ల కంటే చాలా ఎక్కువ సంఖ్యలో ఓట్ల లెక్కింపు జరగడం అనుమానాలకు తావిచ్చింది. అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ భారీ మెజారిటీతో ఎక్కువ స్థానాలను గెలుచుకోవడం వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉందనే విమర్శలు కూడా వచ్చాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను అధికారంలో ఉన్నవాళ్లు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని అనుమానాలు బలపడటం మొదలైంది. ఆ తర్వాత కొద్ది మాసాలకే 2019లో జరిగిన లోకసభ ఎన్నికలలో ఫలితాలు మరిన్ని అనుమానాలకు దారి తీసాయి.అక్కడి నుండి వరుసగా ఎక్కడో ఏదో ఒక మూల ఒక రాజకీయ పక్షం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల మీద సందేహాలు వెలిబుచ్చడం సర్వసాధారణంగా మారింది. బాధ్యతగా వ్యవహరించవలసిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ అనుమానాలను నివృత్తి చేయడానికి పూర్తి ప్రయత్నం ఏనాడూ చేయలేదు. 2024లో లోకసభ ఎన్నికలతోపాటు శాసనసభకు ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అక్కడి ఎన్నికల సంఘం, దాని అధికారులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలు కలిగిస్తున్నదని చెప్పి అక్కడి ప్రస్తుత ప్రతిపక్షం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫిర్యాదు చేస్తూ ఉన్నారు. ఆ విషయంలో ఆ పార్టీ పలు ఉదాహరణలు పేర్కొంటోంది. ఫిర్యాదులు కూడా చేస్తోంది. కొన్ని జిల్లాలలో, కొన్ని నియోజకవర్గాలలో ఓటింగ్ సరళి, తర్వాత జరిగిన లెక్కింపు వ్యవహారంలోఅనేక అనుమానాలను పార్టీ ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువచ్చింది, కోర్టులలో కేసులు కూడా వేస్తోంది. తాజాగా జరిగిన హర్యానా ఎన్నికల ఫలితాలు, నిన్నగాక మొన్న వెలువడిన మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు కూడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల మీద అనుమానాలు రేకెత్తించే విధంగా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు సంబంధించి సర్వే సం స్థలు చేసిన అంచనాలు పూర్తిగా తారుమారై అప్పటి అధికారపక్షం 11 స్థానాలకు పరిమితం కావడం అనేది అనేక అనుమానాలకు తావిచ్చింది. ఎంతటి ప్రభుత్వ వ్యతిరేకత పని చేసి ఉన్నా కొన్ని సీట్లు తగ్గి ఉండేవేమో కానీ పూర్తిగా 151 స్థానా ల నుంచి 11 స్థానాలకు పడిపోవడమనేది ఎన్నికల సంఘానికి కూడా అనుమానాలు వచ్చి ఉండవలసిన పరిస్థితి. అదేమీ జరగకపోగా కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా తనను తాను సమర్థించుకునే పనిలో పడిపోయింది.హర్యానా ఎన్నికల విషయంలో కూడా సర్వే సంస్థలన్నీ ఎగ్జిట్ పోల్స్ లో అక్కడ కాంగ్రెస్ గెలుస్తుందని ఒక అంచనానిచ్చాయి. ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి.

# ఏపీలో ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్ న్యూస్..

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో రాత్రివేళ్లలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతుండడంతో, బస్సు ప్రయాణికులపై ఆ ఎఫెక్ట్ చూపుతుంది. చలికి గజగజ వణికిపోతోన్న ప్రయాణికులు ఇప్పుడు ఏపీ బస్సులు ఎక్కేందుకు జంకుతున్నారు. దీంతో పలు రూట్లలో తిరిగే ఏసీ బస్సు సర్వీసులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సీట్లు ఫుల్ కాకుండానే అలాగే వెళ్లాల్సివస్తోంది..! ఆర్టీసీపై శీతాకాలం ప్రభావం చూపుతోంది. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతూ ఉండడంతో బస్సు ప్రయాణాలపై ఆ ప్రభావం చూపుతోంది. చలికి గజగజ వణికిపోతోన్న ప్రయాణికులు ఏసీ బస్సులను ఎక్కేందుకు హడలిపోతున్నారు. దీంతో పలు రూట్లలో తిరిగే ఏసీ సర్వీస్ బస్సుల్లో సీట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. సీట్లు పూర్తిగా నిండకుండానే అలాగే వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఆర్టీసీ నష్టాలను నివారించాలని, ప్రయాణికులను ఆకర్షించేందుకు నెల రోజుల పాటు ఏసీ బస్సుల్లో ఛార్జీలను 10 నుంచి 20 శాతం తగ్గించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయాణికులకు లబ్ధి చేకూరుతున్న దృష్ట్యా బస్సుల్లో సీట్లు నిండటం సహా ఆదరణ పెరిగేందుకు ఉపకరిస్తుందని అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉష్ణోగ్రతలు ఆంధ్రప్రదేశ్‌లో రోజు రోజుకూ గణనీయంగా తగ్గుతున్నాయి. రాత్రివేళల్లో కొన్ని ప్రాంతాల్లో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీని ప్రభావంతో చలి విజృంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆర్టీసీ పైనా దీని ప్రభావం పడింది. చలి విపరీతంగా పెరగడంతో పలు రూట్లలో ఆర్టీసీ ఏసీ బస్సులు ఎక్కే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. దీంతో ప్రయాణికుల సంఖ్యను పెంచేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రద్దీ తక్కువగా ఉన్న రూట్లలో పలు ఏసీ బస్సుల్లో ఛార్జీలను తగ్గించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఏసీ బస్సుల్లో సీట్ల ఖాళీలను బట్టి 10 నుంచి 20 శాతం ఛార్జీ తగ్గించాలని ఆర్టీసీ ఆదేశాలు జారీ చేసింది. బస్సుల్లో నిండిన సీట్ల సంఖ్యను బట్టి ఛార్జీలను డిసెంబర్ నెలకు మాత్రమే వర్తించేలా ఛార్జీలు తగ్గించాలని ఆర్టీసీ ఆదేశించింది.ఏ ఏ రూట్లలో ఏ బస్సుల్లో ఛార్జీలు తగ్గించాలనే నిర్ణయాన్ని జిల్లా ఇన్ చార్జ్‌గా ఉన్న డీపీటీవోలకు అప్పగించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు రూట్లలో తిరిగే ఏసీ బస్సుల్లో ఛార్జీలను తగ్గిస్తూ ఆయా జిల్లాల డీపీటీవోలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు మధ్య నడిచే ఏసీ బస్సుల్లో చార్జీలను తగ్గిస్తూ ఎన్టీఆర్ జిల్లా డీపీటీవో ఎం. యేసుదానం ఆదేశాలు జారీ చేశారు. ఆది, శుక్రవారాల్లో మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఏసీ బస్సుల్లో ఛార్జీలు తగ్గిస్తున్నట్లు తెలిపారు. తగ్గించిన చార్జీలు డిసెంబర్ 1 నుంచి 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. విజయవాడ %–% హైదరాబాద్ మధ్య తిరిగే డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సుల్లో టికెట్ చార్జీ 10 శాతం తగ్గించారు. ఆదివారం నాడు హైదరాబాద్‌కు, శుక్రవారం నాడు విజయవాడకు వెళ్లే రూటులో చార్జీ తగ్గింపు లేదని తెలిపారు.. అదే విధంగా విజయవాడ %–% బెంగళూరు మధ్య తిరిగే వెన్నెల స్లీపర్, అమరావతి బస్సుల్లో టికెట్ చార్జీ 20 శాతం తగ్గించారు. విజయవాడ %–% బెంగళూరు వెన్నెల ఏసీ స్లీపర్ బస్సుల్లో చార్జీ రూ. 2,170 రూపాయల నుంచి రూ. 1,770 రూపాయలకు తగ్గించారు. విజయవాడ– బెంగళూరు మధ్య అమరావతి ఏసీ బస్సుల్లో చార్జీ రూ. 1,870 రూపాయలు ఉండగా దాన్ని రూ. 1,530 రూపాయలకు తగ్గించారు. ఈ రూట్లో ఆదివారం బెంగళూరు కు, శుక్రవారం విజయవాడ కు వెళ్లే ప్రయాణికులకు చార్జీ తగ్గింపు లేదని అధికారులు తెలిపారు. విజయవాడ విశాఖపట్నం మధ్య నడిచే అన్ని అమరావతి ఏసీ బస్సుల్లో చార్జీ 10శాతం తగ్గించారు. విజయవాడ –విశాఖ –అమరావతి బస్సుల్లో చార్జీ రూ.1,070 రూపాయల నుంచి రూ. 970 రూపాయలకు తగ్గించారు. రాను పోను టికెట్లు ఒకేసారి రిజర్వు చేసుకున్న వారికి ఛార్జీలో 10 శాతం రాయితీ వర్తింపజేయనున్నట్లు ఆర్టీసీ తెలిపింది. ప్రయాణికులు సదావకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ నెలాఖరు వరకు ఛార్జీలు తగ్గింపు వర్తింపజేయాలని ఆదేశించారు. బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉంటే చార్జీపై తగ్గింపు ఇచ్చే గడువును మరికొన్ని రోజులు పెంచే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ అనంతరం బస్సుల్లో రద్దీ పెరిగితే ఛార్జీల తగ్గింపును తీసివేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# దుబాయ్ లా భారత్‌లో ట్యాక్స్ ఫ్రీ స్టేట్

కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా పన్ను విధానంలో మార్పులు చేయలేదు. అయితే కొత్త పన్ను విధానంలో మాత్రం.. కీలక మార్పులు చేస్తోంది. ఇటీవల స్టాండర్డ్ డిడక్షన్ కూడా పెంచింది. ఇదే సమయంలో పన్ను శ్లాబుల్ని కూడా సవరించింది. మరింత సరళీకృతం చేసింది. దీంతో మధ్య తరగతి ప్రజలకు, మధ్య ఆదాయ వర్గానికి ఉపశమనం కలిగింది. మన దేశంలో నిర్దిష్ట పరిమితికి మించి సంపాదించే డబ్బుపై ప్రభుత్వానికి ఇన్‌కంటాక్స్ చెల్లించాల్సి వస్తుంది. ఇక ఎంత ఆదాయంపై టాక్స్ ఎంత కట్టాలి అనేది .. ఆయా టాక్స్ శ్లాబులపై ఆధారపడి ఉంటుంది. పాత పన్ను విధానంలో.. కొన్ని టాక్స్ సేవింగ్ ఇన్వెస్ట్‌మెంట్లతో పన్ను మినహాయింపులు పొందొచ్చు. ÷–రపంచంలోనే అత్యంత ధనిక నగరాల్లో ముందు వరుసలో ఉన్న దుబాయ్‌లో టాక్స్ ఉండదన్న సంగతి తెలిసిందే. ఇక మన దేశంలో కూడా ఇలాంటి ఒక రాష్ట్రం ఉంది. సిక్కిం రాష్ట్ర ప్రజలు.. కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి పన్ను కట్టాల్సిన పని లేదు. వీరికి టాక్స్ పేమెంట్స్ నుంచి మినహాయింపు ఉంది. మన దేశంలో అత్యంత తక్కువ జనాభా ఉన్న రాష్ట్రం కూడా ఇదే. భారత్‌లో 22వ రాష్ట్రంగా గతంలో విలీనమైంది. 1975లో ప్రత్యేకంగా ఒక రెఫరెండం నిర్వహించి మరీ సిక్కింను దేశంలో విలీనం చేశారు. అప్పుడే సిక్కింను పరిపాలిస్తున్న రాజు.. విలీనం కోసం ఒక షరతు పెట్టారు. ఇప్పటివరకు అంటే 1975కు ముందు పన్ను చెల్లింపుల్లో తాము ఎలాంటి చట్టాలు, నిబంధనలు పాటిస్తున్నామో.. విలీనం అయిన తర్వాత కూడా అలాగే ఉండాలని సూచించారు. అంటే.. ఒక ప్రత్యేక హోదా కిందే దేశంలో విలీనానికి ఒప్పుకుంది. 1975కు ముందు నుంచే సిక్కిం.. తమ సొంత పన్ను చట్టం– 1948 అనుసరిస్తూ వస్తుంది. దీని ప్రకారమే కేంద్రానికి వీరు పన్ను చెల్లించరు. 2008లో మాత్రం కేంద్రం.. సిక్కింలో ఉన్న ఇన్‌కంటాక్స్ యాక్ట్‌ను రద్దు చేసింది. రాష్ట్రంలో ప్రత్యేకంగా ఆర్టికల్ 371 (ఎఫ్) విధించింది. టాక్స్ పేమెంట్స్ కోసం కొత్తగా సెక్షన్ 10 (26 ఏఏఏ) తెచ్చింది. దీని ప్రకారం కూడా.. సిక్కింలోని 94 శాతం జనం పన్ను చెల్లింపుల నుంచి మినహాయింపులు పొందుతున్నారు. ఈ సెక్షన్ ప్రకారం.. ఇతర ప్రాంతాల నుంచి స్వీకరించే డివిడెండ్లు, సెక్యూరిటీలపై కూడా వడ్డీల వంటి విషయంలో సిక్కిం ప్రజలు టాక్స్ బెనిఫిట్స్ పొందుతున్నారు. సిక్కింతో పాటుగా.. ఇతర ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, మణిపుర్, నాగాలాండ్, అసోం, అరుణాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లద్దాఖ్ వంటి ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్ తెగల ప్రజలకు కూడా పన్ను చెల్లింపుల నుంచి మినహాయింపు ఉంది. సెక్షన్ 10(26) ప్రకారం కొన్ని ప్రత్యేక ప్రాంతాల ప్రజలకు ఈ టాక్స్ వర్తించదు.

# రేవంత్ రెడ్డి ఏడాది పాలన!



హైదరాబాద్, తెలంగాణ రెండవ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ఏడాది పదవీకాలాన్ని పూర్తిచేసుకుంటున్నారు. అనేక ప్రచారాలు, ఒత్తిళ్ల మధ్య కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక ఏడాది పాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలను పూర్తిచేయడమనేది పెద్ద విషయమే. అయితే ఈ ఏడాదిలో ఆయన ఏం సాధించారో చూడటం కూడా అవసరమే. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి లా రేవంత్ రెడ్డి జీన్స్ లో కాంగ్రెస్ రక్తమున్న నాయకుడు కూడా కాదు. భారతీయ జనతా పార్టీ మూలాలతో, తెలుగుదేశం పార్టీ శిక్షణలో రాటుదేలి ఎదిగిన నాయకుడు! అలాంటి రేవంత్ రెడ్డి కొన్ని తరాలుగా కాంగ్రెసు పార్టీనే నమ్ముకుని ఉన్న నాయకులందరినీ బైపాస్ చేసి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించగలిగారంటే.. అది కేవలం ఆయన కష్టార్జితం. శ్రమ ఫలం. రేవంత్ రెడ్డి దూకుడు, కష్టనష్టాలకు వెరవని తత్వం ఇవన్నీ కలిపి ఆయనను రేసులో ముందంజలో ఉంచి ముఖ్యమంత్రి అయ్యేలా చేశాయి. సీఎం పదవికి తాను ఎంపిక కావడానికి దారి తీసిన కారణాలు, పార్టీ అధిష్ఠానాన్ని ఇంప్రెస్ చేసిన అర్హతలు ఏవైనా కావొచ్చు గాక.. ఎన్నయినా ఉండవచ్చు గాక.. పదవిలో కలకాలం కొనసాగడానికి అవి చాలవు అనే సంగతి రేవంత్ కు చాలా బాగా తెలుసు. అందుకే సీఎం అయ్యేదాకా ఒక తీరు .. అయిన తర్వాత మరో తీరు అన్నట్టుగా ఆయన తన పనితీరును నిర్దేశించుకున్నారు.'ఆరు గ్యారంటీలు' అనే జనాకర్షక హామీలతో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డి.. పగ్గాలు చేపట్టిన వెంటనే రెండింటిని నెరవేర్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. ఆరోగ్య శ్రీ బీమా లిమిట్ ను పది లక్షల రూపాయలకు పెంచారు. సర్వత్రా జనామోదం పొందిన నిర్ణయాలు అవి. ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలు, దూకుడు విషయంలో సహచరులు నోరెత్తలేక మౌనంగా ఉండి పోయే పరిస్థితిని సృష్టించాలని రేవంత్ రెడ్డి ముందుగానే ఒక స్థిరాభిప్రాయానికి వచ్చినట్లుగా కనిపిస్తోంది. ఆయన పనితీరు దానికి తగ్గట్టుగానే ఉంది.దానికి తగ్గట్లుగానే ఆయన పని చేసుకుంటూ పోతున్నారు. పార్టీలో సీనియర్ సహచరులలో అసంతృప్తి రాకుండా తనకు చేతనైన చర్యలు తీసుకుంటున్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఎన్నికల ఫలితాల సమయంలోనే డిప్యూటీ ముఖ్యమంత్రిగా కూర్చుండబెట్టారు. అప్పటి వరకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నివాసం గా ఉన్న భవంతిని, తన జమానాలో డిప్యూటీ అయిన భట్టికి కేటాయించారు. అంతేకాదు, అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలో ముఖ్యమంత్రితో సమానంగా భట్టివిక్రమార్కకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. చివరికి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే ఫోటోల విషయంలో కూడా ముఖ్యమంత్రితో సమానంగా భట్టి విక్రమార్క ఫోటోలు కూడా పెట్టిస్తూ ఆయనను సంతృప్తి పరిచారు.పరిపాలన పరంగా తన ముద్ర చూపించుకోవడం లక్ష్యంగా, తాను మాత్రమే చేయగలిగిన శైలి పనులు ఇవి అనిపించేంత దూకుడుగా ఆయన నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించారు. తెలంగాణ చరిత్రలోనే హైడ్రా కూల్చివేతలు ప్రత్యేక అధ్యాయం! నీటి వనరులను, సరస్సులు, కాలువలను కాపాడడానికి చాలా మొండి ధైర్యంతో హైడ్రా ఆలోచనకు రేవంత్ రూపకల్పన చేశారని చెప్పాలి. అన్ని రకాలుగానూ.. ఇంతటి వైభవోపేతమైన భాగ్యనగరం.. వర్షాకాలంలో దుర్భర జీవితానికి ఆలవాలం అవుతున్నదంటే.. నీటివనరులు శాశ్వత దురాక్రమణలకు గురై ఉండడమే అనే కఠోరసత్యాన్ని సీరియస్ గా పట్టించుకున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.నీటి వనరుల ఆక్రమణల విషయంలో ఎంతటి వారి ఆస్తులైనా సరే, ఎంత విలువైన నిర్మాణాలు అయినా సరే.. వెనక్కు తగ్గేది లేదని.. సమూలంగా నేలమట్టం చేసేయడమే అని ఆయన పలు సందర్భాల్లో నిరూపించుకుని ముందుకు సాగారు. అలాగని, రేవంత్ రెడ్డి పరిపాలనలో లోపాలు లేవని చెప్పలేం. సకాలంలో రైతుబంధు నిధులు ఇవ్వకపోగా రుణమాఫీ చేస్తానని ప్రకటించిన హామీ ఇవాళ్టి దాకా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. హైడ్రా కూల్చివేతల విషయంలో చిన్న చిన్న అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. మూసీ నది ప్రక్షాళన విషయంలో పేదల ఇళ్లు కూల్చి వేయడం అనేది పెద్ద రాద్ధాంతంగా మారిపోయింది.మూసీ నదిని ప్రక్షాళన చేయడం ఆ ప్రాంతం మొత్తానికి పూర్వవైభవం తీసుకురావడం అనేది అతి పెద్ద బృహత్కార్యం. ఇలాంటి కార్యాన్ని తలపెట్టినప్పుడు అవాంతరాలు రావడం సహజం. రాజకీయ అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రజలకు మంచి చేస్తున్నానా లేదా, అలాగే తన నిర్ణయం వలన ఎన్ని పేద కుటుంబాలు పూర్తిగా ఛిద్రమవుతాయి అందుకు తన ప్రభుత్వం చూపగలిగిన పరిష్కారం ఏమిటి? ఇలాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పేదలకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి ఉపాధులు ఏమాత్రం దెబ్బ తినకుండా వారు అదనపు ఇబ్బందులు పడకుండా తన ఆత్మ సాక్షికి తెలిసేలాగా పరిష్కారాలను చూపగలి గారా లేదా అనేది ముఖ్యం. ఆ విషయంలో రేవంత్ రెడ్డి ఇంకా పూర్తిగా దృష్టి సారించినట్లుగా అనిపించడం లేదు మరోవైపు, సీఎం మార్పు బూచీనా చూపిస్తే రేవంత్ రెడ్డి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి, ఆయనలో ఒకరకమైన భయాన్ని రేకెత్తించడానికి ప్రతిపక్షాలు తమ శక్తివంచన లేకుండా పనిచేస్తూనే ఉన్నాయి. కేటీఆర్, కిషన్ రెడ్డి వంటి విపక్ష నాయకులు ఇప్పటికి కొన్ని వందల సార్లు.. రేవంత్ రెడ్డి పదవి త్వరలోనే పోతుందని చెబుతూ వచ్చారు. కానీ వారి అలాంటి మైండ్ గేమ్ కు రేవంత్ ఏ మాత్రం లొంగలేదు. మరింత దూకుడుగా, మరింత ఆత్మవిశ్వాసంతో, మరింత ఘనంగా అడుగులు వేస్తున్నారు. అవినీతి మరకలు తనకు అంటకుండా చూసుకుంటున్నారు. ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలియడం గొప్ప అనే సిద్ధాంతాన్ని ఆయన కూడా పాటిస్తున్నారు. ప్రజాందోళనల్ని ఆయన గౌరవిస్తున్నారు. ఒక రాజకీయ నాయకుడికి ఇది చాలా ముఖ్యమైన లక్షణంగా ఉండాలి. చాలా మంది ప్రజాందోళనల్ని గుర్తించకుండా, గౌరవించకుండా.. తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటూ ఉంటారు. రేవంత్ రెడ్డి అలాంటి తప్పులు అంతగా చేయడం లేదు. ఒక పార్టీ అధికారంలోకి వస్తే.. తొలి ఏడాదిలోనే మేనిఫెస్టో మొత్తం పూర్తిచేసేస్తుందని, చేసేయాలని ఎవ్వరూ ఆశించరు. కానీ హామీల గురించి ప్రతిపక్షాలు ప్రతినిత్యం గోలచేస్తూనే ఉన్నాయి. రేవంత్ అన్ని హామీలకు డెడ్ లైన్ల సహా ఒక కార్యచరణ ప్రణాళిక ప్రకటిస్తే.. ప్రతిపక్షాల నోర్లకు తాళాలు పడతాయి. ఆయన ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

## తెలంగాణలో మళ్లీ సెంటిమెంట్ రాజకీయం

హైదరాబాద్,అధికారంలో ఉన్నపుడు రాజకీయ పార్టీలకు గతం గుర్తుకు రాదు. పవర్ ఒకసారి చేజారాక వాటికి తత్వం బోధపడుతుంది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో నెల కొన్న రాజకీయ పరిస్థితులు అందుకు తాజా ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్ విషయాన్ని ప్రస్తుతానికి అటుంచితే...ప్రస్తుతం తెలంగాణలో రాజకీయాలు వాడివేడిగా సాగుతున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన నాటి టీఆర్ఎస్ ..ప్రస్తుత బీఆర్ఎస్ నేతలు గత ఎన్నికల్లో ఓటమిని ఇప్పటికీ జీర్ణించుకున్నట్టు లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే నెల నాటికి ఏడాది పూర్తవుతుంది. కాబట్టి, తెలంగాణలో సమీపంలో ఎన్నికలు లేవు. మరో నాలుగేళ్ల తర్వాత ఎన్నికలు వస్తాయి. కేంద్రం జమిలి ఎన్నికలు ఆలోచన చేస్తే.. మరో ఐదారు నెలలు ఆలస్యం అవుతుంది. ఎందుకంటే తెలంగాణ ఎన్నికలను లోక్ సభతోనే కలుపుతుంది కానీ ముందే నిర్వహించరు. అయినా రాజకీయాలు మాత్రం వేడి తగ్గడం లేదు. పోటాపోటీగా అధికార విపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయి. తాజాగా సెంటిమెంట్ రాజకీయాలు కూడా ప్రారంభించాయి. తెలంగాణ సాధనలో కీలక ఘట్టం బావించే కేసీఆర్ ఆమరణ దీక్షను ప్రారంభించిన రోజును 'దీక్షా దివస్'గా బీఆర్ఎస్ పార్టీ సెలబ్రేట్ చేసుకుంటోంది. ఇందులో విశేషం ఏమీ లేదు. నిజానికి బీఆర్ఎస్ పార్టీ అస్తిత్వమే తెలంగాణ సెంటిమెంట్. దీక్షాదివస్ వెనక ఉన్నది తెలంగాణ ప్రజల్లో మరోసారి తెలంగాణ సెంటిమెంట్ ని రగిలించటం మినహా మరొకటి కాదు. అధికారంలో ఉన్నప్పుడు కూడా దీక్షా దివస్ నిర్వహించేవారు. కానీ అప్పట్లో క్యాడర్ సాదాసీదాగా చేసుకునేది. అధికార పార్టీగా ఉండటంతో అంత ఊపు ఉండేది కాదు. కానీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు. ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరంలో ఉన్నారు. రాజకీయంగా యాక్టివ్ గా ఉండటానికి ఇది చాలా అవసరం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు క్రెడిట్ మొత్తం తనదే అని దీని ద్వారా గులాబీ పార్టీ చెప్పదలుచుకుంది. ఆ పార్టీ నేతల ప్రకటనలను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. తెలంగాణలో ఏడాది కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ కు ఈ సందర్భం ఒక వేదికైంది. మరోవైపు, తెలంగాణ ఏర్పాటు ఘనత తమదే అని కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లే కార్యక్రమం చేపట్టింది. తెలంగాణ ఏర్పాటుపై నాటి హోం మంత్రి చిదంబరం తెలంగాణ ప్రకటన రోజు 2009, డిసెంబర్ 9ని బీఆర్ఎస్ దీక్షా దివస్ కన్నా బలంగా ..ఘనంగా నిర్వహించాలన్న పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. అంటే ఇప్పుడు తెలంగాణలో ఉత్సవాల రాజకీయం జోరుగా నడుస్తోందన్నమాట. చిదంబరం ప్రకటన వెలువడిన రోజును కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిన రోజుగా సంబరాలు చేయబోతున్నారు. సెక్రటేరియట్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఆవిష్కరణ చబోతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఎట్టి పరిస్థితుల్లోనూ గతంలో బీఆర్ఎస్+నైల్ చేసిన విగ్రహం కాదు. అంతే కాదు పాలనలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మూడో తేదీన బహిరంగసభ నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నారు. అసలు తెలంగాణ అంటేనే ఓ ఎమోషన్ . పొలిటికల్ గా అది చాలా బలమైన ఆయుధం. ఇప్పుడు రెండు పార్టీలు మళ్లీ ఈ ఆయుధాన్ని తమ వద్దకు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని అర్థమవుతోంది. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చడం ద్వారా చాలా నష్టపోయామని అనుకుంటున్న టీఆర్ఎస్ మరోసారి పాత చరిష్మాను పొందాలంటే ఉద్యమ గుర్తులన్నీ మళ్లీ ప్రజల ముందు ఉంచాలని అనుకుంటోంది. అందులో భాగమే దీక్షాదివస్. కాంగ్రెస్ కూడా సోనియా గాంధీ అంగీకరించకపోతే అసలు తెలంగాణ వచ్చేదే కాదని తెలంగాణ తల్లి సోనియా అని అంటున్నారు. వీరి పోటాపోటీ రాజకీయం మరోసారి తెలంగాణ రాజకీయాలను వేడెక్కిస్తోంది.

## జంప్ అయ్యేది ఎవరు?

హైదరాబాద్,తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హస్తిన బాట పట్టారు. వారికి ప్రధాని మోదీ అపాయింట్మెంట్ ఇచ్చారా..? లేక ట్రీట్మెంట్ చేయడానికి పార్టీ పెద్దలుపిలిచారా..? రాజసింగ్ సైతం ఢిల్లీ పయనం అయ్యారంటే లెక్కలేవో సరి చేసే పనిలో అధిష్ఠానం ఉందా..? కొత్త పాత నేతల పంచాయితీ వల్ల గెలిచిన ప్రజా ప్రతినిధులు పార్టీకి దూరమవుతారనే రిపోర్ట్స్ అధిష్ఠాన పెద్దలకు ఏమైనా అందాయా..? అందుకే బ్రెయిన్ వాష్ చేయడానికి పిలిపించుకున్నారా..? మోడీ అపాయింట్మెంట్ వెనక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి నియామకం లెక్కలు తేలుస్తారా?రాష్ట్ర బీజేపీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందా? అంటే జౌననే సమాధానం వస్తుంది.. తెలంగాణలో ప్రత్యామ్నాయం తామే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది మేమే, తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని బీజేపీ నేతలు ప్రకటనలు ఇస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారం చేపట్టేది మేమే అంటూ బీజేపీ నేతలిస్తున్న స్టేట్ మెంట్లు గ్లోబల్ ప్రచారంలా ఉన్నాయన్న చర్చ పొలిటికల్ సర్కిల్లోనే కాదు, ఆపార్టీ సానుభూతిపరుల్లోనూ జరుగుతుండటం గమనార్హం. అందుకు గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మిషన్ 90 లక్ష్యంగా, బీసీ ముఖ్యమంత్రి నినాదంతో అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన బీజేపీ తెలంగాణలో 8 స్థానాలకు పరిమితం అయ్యింది. ఇక దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో చార్ సౌలక్సుతో, మోడీ ఫిర్ ఎక్ బార్ నినాదంతో హడావుడి చేసిన బీజేపీ కేవలం 240 కి పరిమితం కావాల్సి వచ్చింది. తెలంగాణలోనూ డబుల్ డిజిట్ పార్లమెంట్ స్థానాలు సాధిస్తామని చెప్పుకున్న కాషాయ నేతలు 8 స్థానాలే దక్కించుకోగలిగారు. అలా అనుకున్న లక్ష్యాలను అందుకోవడంలో పూర్తిగా విఫలం అయినప్పటికీ ఆ పార్టీ నేతలు నేటికి అదే స్లోగన్స్, అదే గ్లోబల్ ప్రచారం, అదే మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుండటం చర్చనీయాంశంగా మారుతోంది.ఎన్నికల వైఫల్యాలు అటుంచితే, గత ఎన్నికలలో రాష్ట్ర బీజేపీలో కొత్త కుంపట్లు రగిలించాయి. కొత్త, పాత నేతల పంచాయితీ పీక్ స్టేజ్ కి చేరి, కీలక నేతలు పార్టీకి దూరమవడానికి కారణమయ్యిందనే టాక్ వుంది. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయం తామే అని హడావుడి చేసిన కాషాయపార్టీ ఎప్పటికప్పుడు బొక్క బోర్లా పడుతూనే ఉంది. ఇప్పటికే కొత్త, పాత నేతల పంచాయితీ రాష్ట్ర బీజేపీలో సైలెంట్ గా ముదురుతుంది. ఇక గత ఎన్నికల్లో ఊహించని రీతిలో కామారెడ్డిలో విజయం సాధించారు.గెలుస్తారని ఎక్స్పెక్ట్ చేసినవారంతా ఓటమి పాలయ్యారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాజాసింగ్ మినహాయిస్తే అంతా కొత్త ముఖాలే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. రాజాసింగ్ మినహాయిస్తే ఏలేటితో సహా మిగతా ఎవరూ పార్టీకి సంబంధం లేని కొత్త వారే. ఇక పార్లమెంట్ సభ్యుల పరిస్థితి కూడా అలాగే కనిపిస్తుంది.గెలిచిన ఎనిమిది ఎంపీల్లో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను మినహాయిస్తే అందరూ పార్టీకి కొత్తవారే. అలా గెలిచిన వారిని కూడా పార్టీ నాయకత్వం నిలబెట్టుకుంటుందా? లేదా ? అనే అంశం చర్చల్లో నలుగుతుంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారితో రాష్ట్ర నాయకత్వం వ్యవహరిస్తున్న తీరే ఆ అనుమానాలకు తావిస్తుందంటున్నారు.కొత్త నేతలెవరైనా పార్టీలోకి వస్తే అంత తొందరగా జీర్ణించుకోలేని మనస్తత్వం పాతనేతల్లో బలంగా కనిపిస్తుంది. పాత నేతల వైఖరి కారణంగానే బీజేపీలో చేరిన కీలక నేతలంతా పార్టీకి దూరమయ్యారన్న అభిప్రాయం ఉంది. ఇక గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలను సరిగ్గా చూసుకుంటారాలాంటే అదీ లేదు.

# మైనార్టీల భద్రత గాలిలో దీపం..

న్యూఢిల్లీ,మతపరమైన హింసకు బంగ్లాదేశ్ ఆలవాలంగా మారుతోంది. షేక్ హసీనా గత ఆగస్టులో ప్రధాని పదవిని వదిలి, ఇండియాలో తలదాచుకున్నప్పటినుంచీ బంగ్లాదేశ్ లోని మతఛాందసవాదులు హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం పరిపాటిగా మారింది. ఒక అంచనా ప్రకారం గత ఐదు నెలల్లో హిందువులపై 200కి పైగా దాడులు జరిగాయి. తొమ్మిదిమంది చనిపోగా, వందల సంఖ్యలో హిందువులు గాయపడ్డారు. భారీయెత్తున హిందువుల ఆస్తులు విధ్వంసానికి గురయ్యాయి. బంగ్లాదేశ్ లో శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి? నోబెల్ శాంతి బహుమతి విజేత మహమ్మద్ యూనుస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినా, ఈ దాడులు పెరిగాయే తప్ప తగ్గిన దాఖలాలు కనిపించడం లేదు. తాజాగా ఇస్కాన్ మాజీ అధికార ప్రతినిధి, బంగ్లాదేశ్ సనాతన్ జాగరణ్ మంచ్ నేత అయిన చందన్ కుమార్ దాస్ అలియాస్ చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టుతో ఉద్రిక్తతలు మరింత పెచ్చరిల్లాయి. పదిహేడు కోట్ల బంగ్లా జనాభాలో హిందువుల సంఖ్య కోటిన్నరకు మించదు. ఇతర మైనారిటీ వర్గాల సంఖ్య మరింత అల్పం. హిందువులలో అధికశాతం ఓటర్లు షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీకి మద్దతు ఇస్తారనే దుగ్ధతో, అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లు హసీనా ప్రభుత్వంపై పెల్లుబుకిన ప్రజాగ్రహం, ఇప్పుడు హిందువులపైకి మళ్ళింది. వారిపై మతఛాందసవాదులు దాడులకు పాల్పడుతూ, ఆస్తులను విధ్వంసం చేస్తూ వికృతానందం పొందుతున్నారు. చిట్టగాంగ్ లో ఇటీవల జరిగిన ఓ భారీ బహిరంగ సభలో జాతీయ పతాకానికంటే ఎత్తులో కాషాయ జెండాను ఆవిష్కరించి, తమ దేశ పతాకాన్ని అగౌరవపరిచారంటూ వచ్చిన ఓ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని అక్కడి పోలీసులు కృష్ణదాస్ ను అరెస్టు చేసి, జైలుకు పంపారు. అంతటితో ఆగకుండా కృష్ణదాస్ తోపాటు మరో 18మంది బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. చిట్టగాంగ్ లోని పుండరీక ధామ్ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్న కృష్ణదాస్ హిందువుల రక్షణకోసం పోరాటం సాగించడంలో ముందు వరసలో ఉంటున్నారు. హిందువుల పరిరక్షణకోసం ఆయన ఎనిమిది డిమాండ్లు చేసి, వాటి సాధనకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. హిందువులపై జరుగుతున్న దాడులపై విచారణకు ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం, బాధితులకు పరిహారం చెల్లించడం, ధ్వంసమైన ఆస్తులకు పరిహారం చెల్లించడం వంటివి ఆయన డిమాండ్లలో ప్రధానమైనవి. ఇటీవల జరిగిన అల్లర్ల నేపథ్యంలో యూనుస్ మైనారిటీ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరిపినా, జాగరణ మంచ్ డిమాండ్లపై మాత్రం పెదవి విప్పలేదు. మైనారిటీలపై దాడులు జరిగితే తాను పదవినుంచి వైదొలగుతానని మొదట్లో ప్రకటించిన యూనుస్ ఇప్పుడు స్వరం మార్చారు. తమ దేశంలో జరుగుతున్నవి మతపరమైన దాడులు కావంటూ దౌర్జన్యకారులకు వత్తాసు పలకడంతో విస్తుపోవడం ప్రజాస్వామికవాదుల వంతయింది. మరోవైపు కృష్ణదాస్ చేస్తున్న పోరాటం మత ఛాందసవాదులకు కంటగింపుగా మారింది.ఆయన అరెస్టుతో శాంతించని దౌర్జన్యకారులు హిందూ దేవాలయాలపై మూకుమ్మడి దాడులు జరిపి విధ్వంసం సృష్టిస్తున్నారు. కృష్ణదాస్ అరెస్టు అనంతరం, తమ దేశంలో ఇస్కాన్ కార్యకలాపాలను నిషేధించాలంటూ




దాఖలైన ఓ పిటిషన్ ను ఢాకా హైకోర్టు కొట్టివేయడం బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్య వ్యవస్థ కొన ఊపిరితోనైనా బతికి ఉందనడానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. బంగ్లాదేశ్ కు చెందిన ఓ జాతీయ పత్రిక నిర్వహించిన తాజా సర్వేలో దేశంలోని 49 జిల్లాల్లో హిందువులపై దాడులు జరిగినట్లు వెల్లడి కావడం అక్కడ ప్రజాస్వామ్య పతనావస్థను కళ్లకు కడుతోంది.అంతేకాదు, ఆ దేశంలో మతపరమైన హింస క్రమేపీ పెరుగుతోందని రెండేళ్ల క్రితమే ఆమ్నెస్టీ ఇంటర్నెషనల్ ఆందోళన వ్యక్తం చేసింది. అయినా కనువిప్పు కలగని యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తాజాగా జరుగుతున్న దాడులపట్ల కూడా ఉదాసీన వైఖరి కనబరచడమే ఆశ్చర్యకరం. ఈ నేపథ్యంలో బంగ్లాను కట్టడి చేసేందుకు భారత్ రంగంలోకి దిగవలసిన ఆవశ్యకత కనబడుతోంది. మైనారిటీల భద్రతకు చర్యలు తీసుకోవాలంటూ భారత్ పదేపదే చేస్తున్న విజ్ఞప్తులను బంగ్లాదేశ్ పెడచెవిన పెట్టడమే కాదు, పరిస్థితిని భారత్ తప్పుదోవ పట్టిస్తోందంటూ నిరసించడం యూనుస్ ప్రభుత్వం తెంపరితనానికి నిదర్శనం. విజ్ఞప్తులు, విన్నపాలతో యూనుస్ ప్రభుత్వం దారికి వస్తుందన్న ఆశలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో భారత్ ఆంక్షల కొరడా విధించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

## 317 జీవోపై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, తెలంగాణలో జీవో 317 కారణంగా నష్టపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రేవంత్ సర్కారు త్వరలోనే శుభవార్త చెప్పే అవకాశం ఉంది. ఈ జీవో అమలుతో ఇబ్బందులకు గురైన భార్యాభర్తలు, మ్యూచువల్, అనారోగ్య కారణాలున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైలుపై సీఎం రేవంత్ సంతకం చేసినట్టు సమాచారం. 317 జీవోపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ సబ్ కమిటీ మ్యూచువల్, హెల్త్ గ్రౌండ్, స్పౌజ్ ట్రాన్స్ఫర్లు జరపాలని కొన్ని రోజుల కిందట ప్రాథమికంగా నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఫైలును సీఎం రేవంత్ రెడ్డికి పంపగా.. శుక్రవారమే దాన్ని ఆమోదించినట్టు తెలుస్తోంది. అతి త్వరలోనే దీనిపై ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఇటీవల సచివాలయంలో ఉపసంఘం సమావేశమైంది. స్థానికత ప్రకారం ఉద్యోగుల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించింది. న్యాయ వివాదాలకు తావు లేకుండా కేటాయింపు జరగాలని అభిప్రాయపడింది.

## పేదల బియ్యం స్మగ్లింగ్ కేంద్రంగా కాకినాడ

కాకినాడ ఓడ రేవు నుంచి బుధవారం పెద్దమొత్తంలో పేదల రేషన్ బియ్యం తరలింపు వ్యవహారం అలజడి రేపింది. యాంకరేజీ పోర్ట్ నుంచి పశ్చిమ ఆఫ్రికాకు వెళ్లేందుకు సిద్ధమైన స్టెల్లా ఎల్ నౌకలో 640 టన్నుల బియ్యంతో పాటు అదే పోర్టులో మరో నౌకలోకి బియ్యం ఎక్కించేందుకు వెళ్తున్న బార్జ్ ఐవీ 0073లో ఉన్న 1064 టన్నుల బియ్యాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ గుర్తించారు. మొత్తంగా ఆ బియ్యం విలువ 6 కోట్ల 64 లక్షల 60 వేల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే బియ్యం (పీడీఎస్) అడ్డదారిన కాకినాడ పోర్టు ద్వారా తరలిపోతోందని జిల్లా కలెక్టర్‌కు పక్కాగా సమాచారం వచ్చింది. వెంటనే ఆయన బార్జ్‌లు నిలిపే ప్రాంతం నుంచి పోలీస్, పోర్ట్, మెరైన్, రెవెన్యూ పౌర సరఫరాల బృందంతో కలిసి ఐదు నాటికల్ మైళ్ల (సుమారు తొమ్మిది కిలోమీటర్ల) దూరం సముద్రంలో ప్రయాణించి స్టెల్లా ఎల్ నౌక వద్దకు చేరుకున్నారు. ఆ నౌక పశ్చిమ ఆఫ్రికాకు వెళ్లేందుకు సిద్ధంగా ఉంది. సుమారు 52 వేల టన్నుల సామర్థ్యం ఉన్న ఈ నౌకలో 38 వేల టన్నుల బియ్యం లోడ్ కాగా అందులో 640 టన్నులు పీడీఎస్ బియ్యం అని గుర్తించారు. నౌకలోని ఐదు కంపార్ట్‌మెంట్లలో ఉన్న బియ్యం నమూనాలను అక్కడికక్కడే రసాయనాలతో పరీక్షించారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రెండు నెలల కిందట జరిపిన తనిఖీల్లో సీజ్ చేసిన బియ్యాన్ని ఇటీవల బ్యాంకు గ్యారెంటీతో విడుదల చేశారు. ఇప్పుడు పట్టుకున్న బియ్యం నిల్వలు అప్పటివేనా? లేదా లెక్కలోకి ఎక్కని వేరే నిల్వలా? అనే దానిని అధికారులు పరిశీలిస్తున్నారు. నౌకలో ఉన్న 640 టన్నుల బియ్యానికి సంబంధించి 22 ఎగుమతి కంపెనీల రశీదులు ఉన్నాయి. బార్జ్ ఐవీ 0073లో ఉన్న 1064 టన్నుల బియ్యం మరో రెండు కంపెనీలకు చెందినదిగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే, పట్టుబడిన బియ్యం ఇంకా సీజ్ చేయలేదు. ఆ బియ్యం రశీదులు తనిఖీ చేస్తున్నారు. తనిఖీలు పూర్తయ్యాక నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. పేదల బియ్యం స్మగ్లింగ్‌కు కాకినాడ కేంద్రంగా మారినట్లు తమ ప్రభుత్వం మొదట్లోనే గుర్తించింది. అందుకే అక్కడి బియ్యం రవాణా కార్యకలాపాలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బియ్యం విషయం తెలపగానే స్పష్టమైన ఆదేశాలు చ్చారు. కాకినాడ పోర్టులో ఇకపై కూడా ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని మంత్రి నాదెళ్ల మనోహర్ అంటున్నారు. కాగా, చిన్న జలమార్గంలోనే ఓ బార్జ ఉంచి.. అక్కడి నుంచే బియ్యం బస్తాలు లోడ్ చేసి షిప్ వద్దకు తీసుకెళ్తున్నారు. పోర్టు నుంచి లోడింగ్ జరగడం లేదు. అంటే, గతంలో ఏ స్థాయిలో బియ్యం అక్రమ రవాణా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ప్రభుత్వం అంటోంది. బియ్యం స్మగ్లింగ్‌పై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ప్రకటించింది.

## ఏమిటీ ఫెంగల్? ఎందుకు ఈ అలజడి?

తపాను పేరు చెబితే వణికిపోతాం. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను విధ్వంసం సృష్టించడానికి సిద్ధమైంది. శనివారం పుదుచ్చేరిలోని కారైకల్, తమిళనాడులోని మహాబలిపురం తీరాన్ని తాకనుంది. దీని ప్రభావంతో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెదర్ రిపోర్ట్ అధికారులు వెల్లడించారు. పుదుచ్చేరి తీరాన్ని తాకిన తర్వాత దీని వల్ల 7 రాష్ట్రాల్లో వినాశనం కలగవచ్చు. ఈ క్రమంలో కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. దీంతో పాఠశాలలు, స్కూళ్లను మూసివేశారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచనలు జారీ చేశారు.ఈ తుపాను నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. శనివారం తమిళనాడు, పుదుచ్చేరిలో పాఠశాలలు, కళాశాలలు బంద్ చేశారు. వర్షాకాలం ముగిసిన తర్వాత భారతదేశాన్ని ప్రభావితం చేసే రెండవ తుఫాను ఇది కావడం విశేషం. అంతకుముందు అక్టోబర్ చివరి రోజుల్లో తుపాను దానా వచ్చింది. ఇది ఒడిశా, మహారాష్ట్రలో విధ్వంసం సృష్టించింది. ఇప్పుడు నవంబర్ నెలలో ఫెంగల్ తుఫాను విధ్వంసం సృష్టించడానికి సిద్ధంగా ఉంది. దీని కారణంగా ప్రస్తుతం మొత్తం 7 రాష్ట్రాలు హై అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో తమిళనాడు, పుదుచ్చేరి ప్రభుత్వాలు సహాయ శిబిరాలు ఏర్పాటు చేశాయి. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు. ఈ నగరాల్లో ఎలాంటి పరీక్షలు లేదా కోచింగ్ తరగతులు ఉండవు. తమిళనాడు ప్రభుత్వం నవంబర్ 30 మధ్యాహ్నం నుంచి ఈస్ట్ కోస్ట్ రోడ్ , పాత మహాబలిపురం రోడ్ సహా ప్రధాన రహదారులపై ప్రజా రవాణా సేవలను నిలిపివేసింది. బీచ్‌కి దగ్గరగా వెళ్లే రహదారులు తాత్కాలికంగా మూసివేయ బడతాయి.ఫ÷ంగల్ తుపాను సంభవించిన నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు వీలుగా నవంబర్ 30న తమ ఉద్యోగులను ఇంటి నుంచి పని చేసేందుకు అనుమతించాలని ఐటీ కంపెనీలకు ప్రభుత్వం సూచించింది. తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ రాష్ట్రవ్యాప్తంగా 2,229 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. తిరువారూరు, నాగపట్నం జిల్లాల్లో ఇప్పటి వరకు 164 కుటుంబాలకు చెందిన 471 మందిని సహాయక కేంద్రాల్లో ఉంచారు. చెన్నై, కడలూరు, మైలదుత్తురైలలో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున స్థానిక అధికారులు మోటార్ పంపులు, జనరేటర్లు, పడవలతో సహా అవసరమైన పరికరాలను కూడా మోహరించారు.ఫెంగల్ ప్రభావంతో తమిళనాడుతో పాటు ఏపీలో గ్రేటర్ రాయలసీమ పరిధిలోకి వచ్చే నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురవబోతున్నాయి. ఈ మేరకు అధికారులు ఫ్లాష్ ఫ్లడ్స్ రెడ్ అలర్ట్ జారీ చేశారు.

## కొండపై రాజకీయాలకు చెక్

అమరావతి, తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీవారి ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గత కొంతకాలంగా కొందరు రాజకీయ నాయకులు శ్రీవారి దర్శనం తరువాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడటం పరిపాటిగా మారింది. అప్పుడు రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేస్తున్నారు. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో తిరులమలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ బోర్డు ఇటీవల తీర్మానించింది. ఆ నిర్ణయాన్ని తాజాగా అమలులోకి తీసుకువచ్చింది. ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ పేర్కొంది.రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీటీడీ సంచలన నిర్ణయాలను తీసుకుంటుంది. ఈ క్రమంలోనే నకిలీ గుర్తింపు కార్డులతో తిరుమల శ్రీవారి సేవా టికెట్లు, వసతి గదులను పొందేందుకు అక్రమార్కులు చేస్తున్న యత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు కొద్దిరోజుల కిందటే టీటీడీ కార్యచరణ మొదలు పెట్టింది. ఇందుకోసం ఆధార్‌ను టీటీడీలోని పలు సేవలకు అనుసంధానం చేయనుంది.

# ఇండియా కూటమి దెబ్బతినేలా కేజ్రీవాల్ నిర్ణయం?



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయి. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తన పార్టీ స్టాండ్‌ను స్పష్టంగా తెలియజేశారు. ఇండియా కూటమితో కలిసి పోటీ చేయడం అనే ఆలోచననే తమ పార్టీకి లేదని, అన్ని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులే బరిలో ఉంటారని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. రాజకీయంగా ఈ ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఆదివారం మీడియాతో మాట్లాడిన కేజ్రీవాల్, ఢిల్లీ శాంతిభద్రతల పరిస్థితిపై తనపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రశ్నించారు. "నేను ప్రజల సమస్యలను లేవనెత్తడం తప్పా? గ్యాంగ్ స్టర్లను అరెస్టు చేయించడంలో విఫలమైన మీ ప్రభుత్వం మా మీదే దృష్టి పెట్టింది. నాపై దాడి జరగడం ప్రజాస్వామ్యానికి మచ్చ" అని ఆయన విమర్శించారు. ఇండియా కూటమి భాగస్వామిగా ఉన్నప్పటికీ, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోమని, తమ పార్టీ స్వతంత్రంగా పోటీ చేయనున్నట్లు కేజ్రీవాల్ చెప్పిన మాటలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి.గతంలో పంజాబ్ లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి ఆప్ నిరాకరించింది. ఇప్పుడు అదే విధానాన్ని ఢిల్లీలో కొనసాగించబోతుందని తెలుస్తోంది. ఇక ఢిల్లీ కాంగ్రెస్ ఇప్పటికే తమ అభ్యర్థులతోనే బరిలోకి దిగుతామని స్పష్టం చేయడంతో, అటు కాంగ్రెస్ –ఆప్ మధ్య రాజకీయ అసమతుల్యత మరింత స్పష్టమైంది. ఇది భారతీయ జాతీయ కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా భావించబడుతోంది.కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేస్తే బీజేపీని ఎదుర్కోవడంలో బలంగా ఉంటారని భావించిన వర్గాలకు ఈ ప్రకటన షాకింగ్‌గా మారింది. ఢిల్లీలో ఆప్ ఒంటరిగా పోటీ చేయడం, కాంగ్రెస్ కూడా అదే విధానాన్ని అనుసరించడం బీజేపీకి లాభసాటిగా మారుతుందా లేదా అనే దానిపై రాజకీయ విశ్లేషకులు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ఢిల్లీపై తన పట్టు చాటేందుకు కేజ్రీవాల్ తీసుకున్న ఈ వ్యూహం ఏ మేరకు విజయవంతం అవుతుందో వేచిచూడాల్సిందే.

# షిండే,అజిత్ లను బీజేపీ ఎన్నాళ్లలో వదిలించుకుంటుంది?

ముంబై:మహారాష్ట్రలో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 288. లెక్క ప్రకారం కనీస మెజారిటీ 145. ప్రస్తుతం బీజేపీకి సొంతంగా ఉన్న ఎమ్మెల్యేల బలం 132. శివసేన(షిండే) పార్టీ తరఫున నెగ్గిన వారి సంఖ్య 57. ఎన్సీపీ (అజిత్) పార్టీ తరఫున నెగ్గిన వారి సంఖ్య 41. ప్రస్తుతం బీజేపీ ఫార్ములా ప్రకారం.. సీఎం సీటు బీజేపీ నేతకు, షిండే, అజిత్ లకు డిప్యూటీ సీఎం పదవులు అనే మాట వినిపిస్తూ ఉంది.మొన్నటి వరకూ షిండేకు డిప్యూటీ సీఎంగా వ్యవహరించిన మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను లాంఛనంగా సీఎం గా చేయొచ్చు. గతంలో తను సీఎంగా వ్యవహరించినప్పటికీ ఫడ్నవీస్ అసరార్థం ఆ తర్వాత షిండేకు డిప్యూటీగా చేశాడు కాబట్టి, ఇప్పుడు షిండే ఆయనకు డిప్యూటీగా చేయడంలో పెద్ద ఘోరం ఏమీ లేదనేది బీజేపీ తరఫున వినిపిస్తున్న థియరీ. ఇక డిప్యూటీ సీఎం పాత్రకే రాజకీయాల్లో ఉన్నట్టుగా అజిత్ పవార్ ఉన్నాడు. కాబట్టి.. ఆయన కు డిప్యూటీ సీఎం పదవే పరమాన్నం! అయితే ఎటొచ్చీ షిండేనే గొణుగుతున్నట్టుగా ఉన్నాడు.మోడీ, షాలు ఏది చెబితే అని నిష్టూరం ఆడుతున్నాడు, శివసేనను చీల్చుకొచ్చినప్పుడు తనను సీఎంగా చేశారు కాబట్టి, ఇప్పుడు కూడా తననే సీఎంగా చేయాలనే డిమాండ్ ఆయన వైపు నుంచి వినిపించింది. మరి ఇలాంటి డిమాండ్ చేసినందుకే కదా.. ఉద్ధవ్ థాక్రేను బీజేపీ వాళ్లు శంకరగిరి మాన్యాలు పట్టించారనేది షిండేకు తెలియని అంశం అయితే కాదు!రాజీ పడటం మినహా షిండేకు మరో మార్గం కూడా లేదు. ఆయన ఆ మాత్రం లౌక్యం తెలియనివాడూ కాదు. అయితే సీఎం హోదాలో ఉన్నప్పుడే షిండే పలు సార్లు అలిగాడు. తనను సీఎంగా కూర్చోబెట్టి మొత్తం బీజేపీ వాళ్లు ఆడుకుంటున్నారనే ఆక్రోశం ఆయనలో గతంలోనూ ధ్వనించింది. ఒక దశలో ఆయన అలిగి వెళ్లిపోయారనే ప్రచారమూ జరిగింది. సీఎంగా తను ఉండగా.. కేబినెట్ గురించి అయినా, మరో విషయంలో అయినా డిప్యూటీ సీఎం ఢిల్లీకి వెళ్లి చర్చించి రావడం గురించి షిండే నొచ్చుకున్నారు! అయితే అప్పుడు అలా నొచ్చుకున్నా పెద్ద మార్పేం కనిపించలేదు. గత్యంతరం లేక బీజేపీతోనే షిండే ఎన్నికలకు వెళ్లారు. మరి ఇప్పుడు ఆయన కొత్తగా చేయగలిగింది ఏమీ లేదనే చెప్పాలి.సీఎం హోదాలో కూర్చోబెట్టినప్పుడే తనను డమ్మీగా చేసిన బీజేపీ ఇప్పుడు డిప్యూటీ సీఎం హోదాలో ఉంటే తనతో ఆటాడుకోవడం పెద్ద విషయం కాదని ఆయన గ్రహించే ఉండాలి. కొందరు తెలివైన వాళ్లు ఇచ్చే సలహా ఏమిటంటే.. షిండే ఇప్పుడు డిప్యూటీ సీఎం హోదా తీసుకోకపోవడమే మంచిదని. కావాలంటే కేంద్ర మంత్రి పదవి, లేదా ఈ కూటమి కన్వీనర్ వంటి పదవి తీసుకుని డిప్యూటీ సీఎం హోదా జోలికి వెళ్లకపోవడమే మంచిదని షిండే హితోభిలాషులు సోషల్ మీడియాలో సలహాలు ఇస్తున్నారు.అయితే ఏ హోదాలో ఉన్నా, షిండే కు అప్రాధాన్యత అంటే ఏమిటో ఇప్పుడు బీజేపీ రుచి చూపిస్తుంది. ఆల్రెడీ సీఎంహోదాలోనే ఆయన చూసి ఉన్నారు. అయితే అప్పుడు తాము సీఎం సీటు ఇచ్చినందుకు బీజేపీ ఎంత బాధపడిందీ ఇప్పుడు ఆయనకు అర్థమయ్యేలా చేస్తారనడంలో ఎలాంటి వింత లేదు! అప్పుడు బీజేపీ తన అవసరార్థమే షిండేకు సీఎం సీటు ఇచ్చింది. అయినా ఇప్పుడు ప్రతీకారం



అయితే గట్టిగానే ఉండొచ్చు. బీజేపీ కోరిక మేరకే షిండే శివసేనను చీల్చుకొచ్చారు. బీజేపీతోనే కలిసి సాగుతున్నారు. అయినా షిండేకు చుక్కలు కనిపించడం అయితే ఖాయం.ఇప్పుడు తన వద్ద 57 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని షిండే అనుకోవడానికి ఏమీ లేదు! వారిలోంచి ఇంకో షిండేను పుట్టించాల్సిన అవసరం కూడా ఇప్పుడు బీజేపీ లేదు! ఒకే మాటతో.. శివసేనను తాము విలీనం చేసేసుకుంటున్నామని బీజేపీ ప్రకటించినా అరిచి గగ్గోలు పెట్టే నాథుడు లేడు! ఇక శివసేన ఎమ్మెల్యేల్లో కూడా షిండేను లెక్క చేసేది ఎంతమంది? ఉద్ధవ్ థాక్రేనే లెక్క చేయని వాళ్లు ఇప్పుడు షిండేను లెక్క చేస్తారని ఎవ్వరూ అనుకోరు. బీజేపీ అనుకుంటే.. ఈ విలీనం రోజుల వ్యవధిలో పూర్తవుతుంది. షిండే ఒక్కడూ అప్పుడు గగ్గోలు పెట్టినా పట్టించుకునే వారు ఉండరు. అప్పుడు ఉద్ధవ్ కు నువ్వు నామాలు పెడితే, ఇప్పుడు నీకు బీజేపీ నామాలు పెట్టిందనే మాటే సర్వత్రా వినిపిస్తుంది.ఇక అజిత్ పవార్ సంగతి సరే సరి. ఆయనకు ఇప్పుడు ఇగో ఇష్యూస్ ఏమీ లేవు. కేసులు, ఇబ్బందులు లేకపోతే చాలు. మంత్రి పదవి, డిప్యూటీ సీఎం.. హోదాల గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదు. అయినా అజిత్ కు డిప్యూటీ సీఎం అంటున్నారట! అదే ఆయనకు పదివేలు! గతంలో తాము తీవ్ర అవినీతి పరుడుగా చెప్పిన అజిత్ కు బీజేపీ ఎప్పుడో మంచివాడనే తీర్థం పోసింది కాబట్టి.. బీజేపీ ప్రాపకంలో అజిత్ బ్యాలెన్స్ రాజకీయ జీవితం కొనసాగవచ్చు! అది ఆయన అదృష్టం. కానీ, అజిత్ ను బీజేపీ వదిలించుకోవాలనే డిమాండ్ కమలం పార్టీలోని ఒక వర్గం నుంచి వినిపిస్తూ ఉంది. అవసరానికి తీసుకున్నారు సరే, ఇప్పుడు అతడి అవసరం లేదని, ఇక శంకరగిరి మాన్యాలు పట్టించాలని ఈ వర్గం వాదిస్తూ ఉంది. కాబట్టి.. అజిత్ వీలైనంతా సాగిలా పడటమే మిగలవచ్చు!ఏతావాతా.. మహారాష్ట్ర రాజకీయాల్లో షిండే, అజిత్ పేర్లు ఇక వీలైనంత తక్కువగా, వీలైనంత చిన్నగా వినిపించడం ఖాయంగా కనిపిస్తూ ఉంది. వచ్చే ఎన్నికల నాటికి వీరిని రాజకీయ చిత్రం నుంచి వీరి ప్రాధాన్యతను బీజేపీ చాలా తగ్గించివేస్తుంది. అసలు వీరొకరు ఉన్నారనే విషయాన్ని ప్రజలు, పరిశీలకులు కూడా పట్టించుకోని పరిస్థితి వచ్చే అవకాశాలు అయితే పుష్కలంగా కనిపిస్తూ ఉంది.

# పోలీసులకు చిక్కిన ఘరానా దొంగల ముఠా..



హైదరాబాద్,తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసే దొంగలను చూసి ఉంటాం. షాపులకు కన్నం వేసే కేటుగాళ్లను చూసి ఉంటాం. ఆఖరికి గుడిలో హుండీలను మాయం చేసిన చోరులను చూసి ఉంటాం. కానీ, ఈ దొంగలు ఇవన్నీ కాదని కొత్త రూట్ ను ఎంచుకున్నారు. చుట్టంలా వస్తున్నారు.. అన్నీ చుట్టేసి చెక్కేస్తున్నారు. పైగా వీళ్లు అలాంటి ఇలాంటి దొంగలు కాదు.. దొంగల బడిలో శిక్షణ తీసుకుని చిక్కకుండా చక్కబెట్టుకోవచ్చు అనే స్కిల్ ను అలవాటు చేసుకున్నారు. అసలీ దొంగలు ఎవరు, వారి టార్గెట్ స్పెషాలిటీ ఏంటి? ఫంక్షన్ హాల్స్ లో పెళ్లిళ్లు, శుభకార్యాలు అంటే కొందరు తెలియని వారు కూడా వస్తారు. మహా అయితే భోజనం చేసి వెళ్లిపోతారు. కానీ, వీళ్లు అలా కాదు. ఎక్కడైనా ఫంక్షన్ జరుగుతుంటే చుట్టంలా వస్తారు. పెళ్లికి వచ్చిన బంధువులతో కలిసిపోతారు. పెళ్లి పనులను నెత్తిన వేసుకుని మరీ చేస్తారు. వీళ్లు చూసే హడావుడి చూసి పెళ్లి పనులు భలే చేస్తున్నారే అనిపిస్తుంది. పెళ్లి పనులు చేస్తూనే వచ్చిన పనిపై ఫోకస్ పెడతారు ఆ కేటుగాళ్లు. ఫంక్షన్ కు వచ్చిన బంధువులు ఎవరు బంగారాన్ని బ్యాగులో పెట్టారు, ఎవరి వద్ద గోల్డ్ ఉన్న బ్యాగ్ ఉందని పరిశీలిస్తారు. ఇక వాళ్ల పెళ్లి సందడిలో బిజీగా ఉన్నప్పుడు అదను చూసుకుని సైలెంట్ గా బ్యాగ్ తో ఉడాయిస్తారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి ట్రాంక్విల్ రిసార్ట్ లో నవంబర్ 14న జరిగిన పెళ్లి వేడుకలో చోరీ జరిగింది. కొందరు వ్యక్తులు బంధువుల్లా వచ్చి బంగారంతో చెక్కేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసుని ఛేధించి మహారాష్ట్రలో నలుగురు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 38 తులాల బంగారం, 40వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇక విచారణలో విస్తుపోయే నిజాలు బటయపడ్డాయని పోలీసులు వెల్లడించారు.మధ్యప్రదేశ్ రాజ్ గడ్ జిల్లా గులే?డీ, హులే?డీ, ఖడియా గ్రామాల్లో కొందరు యువకులు దొంగతనాన్నే తమ వృత్తిగా మార్చుకున్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పేందుకు విద్యా సంస్థలు ఉన్నట్లు ఈ గ్రామాల్లో దొంగలకు శిక్షణ ఇచ్చే సెంటర్లు ఉన్నాయి. దొంగతనం, రద్దీ ప్రదేశాల్లో బ్యాగులు కొట్టేయడం, వేగంగా పరిగెత్తడం, పోలీసుల నుంచి తప్పించుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. పిల్లలకు 12, 13 ఏళ్ల వయసు ఉన్నప్పుడు స్వయంగా తల్లిదండ్రులే ఈ పాఠశాలలకు పంపిస్తారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు దొంగతనాలు, దోపిడీల్లో ఆరితేరిపోతారు. శిక్షణ తీసుకునే వారిలో ఎక్కువగా మైనర్లే ఉండటం షాకింగ్ విషయం.శ్రీమంతుల ఇళ్లలో జరిగే ఖరీదైన పెళ్లిళ్లు, శుభకార్యాలకు పిల్లలను అందంగా ముస్తాబు చేసి ఈ గ్యాంగ్ పంపిస్తుంది. బంగారం, వజ్రాల నగలు, డబ్బులు దొంగిలించేలా ప్లాన్ ను పక్కాగా అమలు చేస్తుంది. దొంగతనం తర్వాత దోచుకున్న సొమ్ముతో నేరుగా గ్రామానికి చేరుకుంటారు. అయితే, ఈ ముఠాలను స్వగ్రామానికి చేరుకోకముందే పట్టుకోవాల్సి ఉంటుంది. లేకపోతే కష్టమే.

# తెలంగాణలో ప్రధాన పార్టీలకు పంచాయతీ పరీక్ష

హైదరాబాద్,తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తు పూర్తయింది. వచ్చే ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ ముహూర్తం నిర్ణయించినట్టు పక్కా సమాచారం. అంతా అనుకున్నట్టు జరిగితే జనవరి రెండో వారంలో షెడ్యూల్ విడుదలవుతుంది. సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్ ఇచ్చి, మూడు దశల్లో ఎన్నికలు పూర్తిచేస్తారు. దాంతో ప్రధాన పార్టీలు రెండు నెలల్లో జరిగే స్థానిక సమరానికి సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష. నగారా మోగగానే అవి మళ్లీ ప్రజల్లోకి వెళ్లబోతున్నాయి. నిరుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది జరిగిన లోకసభ ఎన్నికల్లో బీజేపీ ఊహించని ఫలితాలు సాధించగా..భారత రాష్ట్ర సమితి మాత్రం చావు దెబ్బతిన్నది. ప్రస్తుతం బీఆర్ఎస్ ఉనికి కోసం పోరాడుతోంది. తన బలాన్ని తిరిగి కూడగట్టుకునే అవకాశం స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా కలుగుతోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటిన బీఆర్ఎస్ పట్టు నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్‌లో సత్తాచాటిన గులాబీ పార్టీ.. గ్రామీణప్రాంతాల్లోనూ తమ బలం తగ్గలేదని నిరూపించుకునేందుకు ఇది గొప్ప అవకాశం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భారాన్ని స్థానిక సంస్థల్లో దించుకోవాలన్న వ్యూహంతో ఉంది బీఆర్ఎస్. ఇక పాలక కాంగ్రెస్ స్థానిక సంస్థల్లోనూ సత్తా చాటాలనుకుంటోంది. రుణమాఫీ కార్యక్రమంతో పాటు సంక్షేమ పథకాలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కలిసొస్తాయన్న ధీమాతో ఉంది. అధికారంలోకి రాగానే స్థానికసంస్థల్లో పట్టుకోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్.. వచ్చే ఎన్నికలను సవాల్‌గా భావిస్తోంది. ఇవి రేవంత్‌రెడ్డి ఏడాది పాలనకు రెఫరెండం లా మారబోతున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బలం పుంజుకున్న బీజేపీకి కూడా స్థానికసంస్థలు సవాలుగా మారబోతున్నాయి. క్షేత్రస్థాయిలోనూ బలం ఉందని నిరూపించుకోవా లంటే స్థానిక సంస్థల్లో కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. ఒకరికిద్దరు కేంద్రమంత్రులున్నా పార్టీ రాష్ట్ర సారథిపై నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలుకావటంతో త్వరగా కొత్త అధ్యక్షుడెవరో తేలిస్తే ఎన్నికలకు సిద్ధంకావచ్చంటోంది ఆ పార్టీ కేడర్. మొత్తానికి తొమ్మిదినెలల గ్యాప్ తర్వాత మళ్లీ తెలంగాణలో ఎన్నికల హడావుడి మొదలుకాబోతోంది. గల్లీదాకా పార్టీజెండా ఎగిరే ఎన్నికలు కావటంతో మూడు ప్రధానపార్టీలకూ అత్యంత కీలకం కాబోతున్నాయి. ప్రస్తుతం, ప్రత్యేక అధికారులు గ్రామ పాలనను చూస్తున్నారు. దాంతో కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి.



కులగణన తర్వాత లోకల్ బాడీల్లో బీసీల రిజర్వేషన్లు పెంచి పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. దాని ప్రకారం కులగణన ప్రక్రియలో భాగంగా సర్వేను దాదాపు పూర్తి చేసింది. బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ డెడికేటెడ్ కమిషన్ ను నియమించగా.. జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది. ఈ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి బీఆర్ఎస్, బీజేపీని క్షేత్ర స్థాయిలో ఖతం చేయాలన్న వ్యూహంతో సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సాధ్యమైనన్ని ఎక్కువ స్కీమ్స్ ను అమలు చేయాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రైతు భరోసా సాయం, పెన్షన్లను పెంచాలని భావిస్తున్నట్లు సమాచారం. మరో వైపు మహిళలకు నెలకు రూ.2500 అందించే స్కీమ్ ను సైతం అమలు చేయాలని రేవంత్ సర్కార్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఇందుకోసం నిధుల సమీకరణ, గైడ్ లైన్స్ రూపకల్పనపై అధికారులు ఫోకస్ పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పథకాల లబ్దిదారుల ఓట్లలో స్థానిక సంస్థలపై కాంగ్రెస్ జెండా ఎగర వేయాలన్నది ప్రభుత్వ ఎ÷–లాన్ గా తెలుస్తోంది. రాష్ట్రంలో 32 జిల్లాలు, 538 మండలాల పరిధిలో 12,867 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో మూడు విడతలుగా ఎన్నికలు జరిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,67,33,584 ఓటర్లు ఉండగా.. అందులో పురుష ఓటర్లు 82,04,518 మంది, మహిళా ఓటర్లు 85,28,573 మంది, ట్రాన్స్ జెండర్స్ ఓటర్లు 493 మంది ఉన్నారు. ఒక దశలో నాలుగు వేల పంచాయతీల చొప్పున మూడు దశల్లో ఎన్నికలు పూర్తి చేయాలనుకుంటున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడినా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

# పవన్ షిప్ సీజ్ ఆదేశాలు చెల్లవా?



అమరావతి,కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న షిప్ ను కలెక్టర్ షగిలి షన్మోహన్ సముద్రంలో పట్టుకున్న రెండు రోజుల తర్వాత అక్కడికి వెళ్లి దాన్ని సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన ఆదేశాలు చెల్లవా ? తనకు లేని అధికారాన్ని ఆపాదించుకుని పవన్ ఈ ఆదేశాలు ఇచ్చారా ? పవన్ ఆదేశాలను ఇప్పుడు పాటించే పరిస్థితి లేక ప్రభుత్వం ఇరుకునపడిందా ? ఇప్పుడేం చేయబోతోంది ? కాకినాడ పోర్టుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇదే చర్చ జరుగుతోంది. కాకినాడ పోర్టులో సౌతాఫ్రికాకు చెందిన స్టెల్లా ఎల్ 1 నౌకలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారనే కారణంతో దాన్ని సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు ఇచ్చారు. అయితే సముద్ర రవాణా ప్రభుత్వ పరిధిలోకి రాదు. అందులో స్మగ్లింగ్ జరిగితేనే దాన్ని సీజ్ చేసే అధికారం మాత్రమే ప్రభుత్వ అధికారులకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ పట్టుకున్న రేషన్ బియ్యం రవాణా స్మగ్లింగ్ కిందకు రాదని అధికారులు చెప్తున్నారు. దీంతో పవన్ కళ్యాణ్ ఆదేశాల ప్రకారం ఈ షిప్ ను సీజ్ చేసే పరిస్థితి లేదని అర్థమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ షిప్ ను వదిలేయాలా లేక మరేదైనా చర్యలు తీసుకోవాలా అన్న మీమాంసలో పడిన అధికారులు, కాకినాడ పోర్టు యాజమాన్యం.. చివరికి నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా ప్రస్తుతానికి దాన్ని అడ్డుకుంది. అయితే ప్రత్యామ్నాయ చర్యల విషయంలో ప్రభుత్వం అడ్మిరాలిటీ కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పౌరసరఫరాలశాఖ ఆ మేరకు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకీ ఈ ఆడ్మిరాలిటీ కోర్టు అంటే ఏంటి? మామూలు కోర్టులకూ దీనికి తేడా ఏంటి? సముద్రంలో తలెత్తే వివాదాలకు సంబంధించిన కేసుల్ని పరిష్కరించేందుకు చట్టంలోని సెక్షన్ 2(1)(ఇ) ప్రకారం సాధారణ కోర్టుల్లో ఎంపిక చేసిన వాటికి అడ్మిరాల్టీ అధికారం కల్పించారు. ఇలా అడ్మిరాల్టీ కోర్టు అధికార పరిధిని కలిగి ఉన్న హైకోర్టుల జాబితాలో కలకత్తా, బొంబాయి, మద్రాస్, కర్ణాటక, గుజరాత్, ఒరిస్సా, కేరళ, హైదరాబాద్‌లతో సహా భారతదేశంలోని ఎనిమిది హైకోర్టులు ఉన్నాయి.ఇవన్నీ సముద్ర సంబంధ దావాలకు సంబంధించి హైకోర్టుల అధికార పరిధి, వాటి సంబంధిత అధికార పరిధిలోని ప్రాదేశిక జలాల్లో వివాదాల్ని పరిష్కరిస్తాయి. ఇప్పుడు ఈ కోర్టుకు వెళ్లి ఆ షిప్ వ్యవహారం తేల్చాల్సి ఉంది.

# రేషన్ బియ్యం మీద కూటమి సంచలన నిర్ణయం ?

అమరావతి,ఏపీలో రేషన్ బియ్యం మీద ఇపుడు పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. సాధారణంగా చౌక బియ్యం గురించి ఎపుడూ ఈ లెవెల్ లో చర్చ అయితే సాగింది లేదు. దానికి కారణం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణా మీద పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడమే అని అంటున్నారు. గత రెండేళ్ళుగా పవన్ ఇదే విషయం మీద ఉన్నారు.అక్రమంగా లక్షల టన్నులలో విదేశాలకు పోతున్న ఈ ఉచిత బియ్యం కొందరు అక్రమార్కులకి వేల కోట్ల ఆదాయంగా మారుతోందని భావిస్తున్నారు. దానికి అడ్డుకట్ట వేసేందుకు చెక్ చెప్పేందుకు కూడా ఆయన గట్టి పట్టుదల మీద ఉన్నారు. పవన్ ఎంతలా పట్టుబట్టు ఉన్నారు అన్న దానికి ఒక అచ్చమైన ఉదాహరణను చూస్తే మూడు రోజుల క్రితం తుఫానుతో అలజడిగా ఉన్న సముద్రంలోకి ఆయన బోట్లు వేసుకుని మరీ వెళ్ళి సీజ్ అయిన షిప్ ని పరిశీలించడమే అని అంటున్నారు.అంతలా ఆయన దీని మీద ఫోకస్ పెట్టేశారు. ఢిల్లీ నుంచి నేరుగా కాకినాడ పోర్టులోకి ల్యాండ్ అయిన పవన్ ఒక పూట అంతా అక్కడే గడిపారు. అక్రమార్కులను కనిపెడతామని రేషన్ బియ్యం మాఫియాకు పూర్తి స్థాయిలో చెక్ పెడతామని కూడా ఆయన అంటున్నారు.ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా దీని మీద సీరియస్ గా ఉంది. ఈ నెల 3న జరిగే మంత్రివర్గ సమావేశంలో కాకినాడ పోర్టు అక్రమ బియ్యం రవాణాకు అడ్డాగా మారిన వైనం మీద చర్చిస్తారు అని అంటున్నారు. దీనిని అరికట్టేందుకు గల అవకాశాల మీద పూర్తి స్థాయిలో చర్చిస్తారు అని అంటున్నారు.మరో వైపు చూస్తే రేషన్ బియ్యం ఒకప్పుడు రెండు రూపాయలు ఉండేది. ఆ తరువాత అది రూపాయికే ఇస్తూ వచ్చారు. ఇక కరోనా వైరస్ నేపథ్యంలో ఉచితంగా అందిస్తున్నారు మనిషికి అయిదు కేజీల వంతున ఈ బియ్యం ఇస్తున్నారు. అయితే ఈ బియ్యం పూర్తిగా దుడ్డుగా ఉండడంతో ఎవరూ తినలేకపోతున్నారు.దాంతో దీనిని రేషన్ డీలర్ కే కిలో పది రూపాయలు వంతున అమ్మేస్తున్నారు. అలా నూటికి తొంబై శాతం బియ్యం రేషన్ బియ్యం తీసుకోకుండా నగదే తీసుకుంటున్నారు అన్నది బహిరంగ రహస్యం. దాంతో ప్రభుత్వం దీని మీద పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తుంది అని అంటున్నారు.ప్రజలు ఎవరూ ఈ బియ్యం తీసుకోకపోతే ఎందుకు రేషన్ ద్వారా బియ్యం ఇవ్వడం అన్న ఆలోచనలో కూడా సర్కార్ ఉన్నట్లుగా



అంటున్నారు. దాంతో రానున్న రోజులలో రేషన్ బియ్యం మీద సంచలన నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది అని అంటున్నారు.అంటే రేషన్ దుకాణాలలో బియ్యానికి బదులుగా నగదుని వారి ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం చూస్తోంది అని అంటున్నారు. అంతే కాదు బియ్యానికి బదులుగా ఇతర సరుకులు ఇచ్చేలా కూడా ఆలోచన చేస్తోందని అంటున్నారు. దాంతో రేషన్ బియ్యం ఎటూ తరలిపోకుండా పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వ వర్గాలలో చర్చ అయితే సాగుతోంది. అదే కార్యరూపం దాలిస్తే రేషన్ లబ్దిదారులకు ఏ నష్టమూ ఉండదు, వారికి బియ్యానికి బదులుగా నగదు ఖాతాలో పడుతుంది. ఈ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి దోచుకునే దందాకే చెక్ పడుతుందని అంటున్నారు. మరి చూడాలి ప్రభుత్వం ఏ విధంగా దీని మీద నిర్ణయం తీసుకుంటుంది అన్నది.

## కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

ప్రయాగ్‌రాజ్,ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వచ్చే ఏడాది జరగనున్న మహాకుంభమేళాకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ విదేశాల నుంచి భక్తులు, సాధువులు సహా దాదాపు 40 కోట్ల మంది యాత్రికులు వస్తారని అంచనా వేస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళాను నిర్వహించనున్నారు. ఈ జాతర కోసం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com